

నేటి నుంచి పెన్షన్ల పంపిణీ

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పథకం కింద జిల్లాలో 1,58,235 మందికి శుక్రవారం ఉదయం నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. ఇందుకోసం రూ.69.34 విడుదలైనట్టు చెప్పారు. శుక్రవారం అందుబాటులో లేని పింఛన్‌దారులకు శనివారం ఇస్తామన్నారు. పింఛన్‌దారులు శుక్ర, శనివారాలు ఇళ్ల వద్ద ఉండాలని కోరారు. కాగా, పింఛన్ పొందుతూ చనిపోయిన వారి భార్యకు పింఛన్ మంజూరుచేసినట్టు కలెక్టర్ తెలిపారు. కొత్తగా 2,524 మందికి వితంతు పెన్షన్లు మంజూరయ్యాయన్నారు.



పూర్తిగా ధ్వంసమైన పోర్టు ఆసుపత్రి వద్ద బస్‌బే

నామరూపాల్లేని బస్ బేలు

- నగరంలో 23 చోట్ల ఏర్పాటు
- దాదాపు రూ.మూడు కోట్లు వెచ్చించిన జీవీఎంసీ
- రెండేళ్లు గడిచేసరికి ధ్వంసం
- ఆకతాయిలు ఆగడాలతో కొన్ని...
- నాణ్యత లేక మరికొన్ని...
- నిర్వహణను పట్టించుకోని జీవీఎంసీ, ఆర్టీసీ అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో ఎంతో ఆర్భాటంగా అందుబాటులోకి తెచ్చిన స్మార్ట్ బస్‌బేలు ఇప్పుడు నామ రూపాలను కోల్పోయాయి. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన బస్‌బేలు జీవీఎంసీ, ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రెండేళ్లు తిరిగేసరికి ధ్వంసమైపోయాయి. కొన్నిచోట్ల ఆకతాయిలు లైట్లు, ఎలివేషన్ షీట్లను ఎత్తుకుపోగా, మరికొన్నిచోట్ల నాణ్యతలేని సామగ్రి కారణంగా బస్‌బేలు పాడైపోయి ప్రయాణికులు కూర్చునేందుకు వీల్లేకుండా తయారయ్యాయి.

స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో ప్రజలకు మౌలిక వసతులను కూడా అదేస్థాయిలో అందించాలనే లక్ష్యంతో స్మార్ట్ బస్‌బేలకు శ్రీకారం చుట్టారు. 2023 మార్చిలో జరిగిన జీ-20 సన్నాహక సదస్సు సందర్భంగా ఏయూ అవుట్‌గేట్ పక్కన ఉన్న బస్టాప్‌ను రూ.25 లక్షలు వెచ్చించి స్మార్ట్‌గా తీర్చిదిద్దారు. దీనికి ప్రశంసలు రావడంతో అదే స్ఫూర్తితో నగరంలోని మరిన్ని బస్టాపులను స్మార్ట్ బస్‌బేలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. మధురవాడ నుంచి కూర్మన్నపాలెం వరకు జాతీయ రహదారిపై ఉన్న 22 బస్టాపులను దాదాపు రూ.మూడు కోట్ల వ్యయంతో స్మార్ట్ బస్‌బేలుగా అభివృద్ధి చేశారు. జిప్సం షీట్లతో ఎలివేషన్, వేడిని తగ్గించేలా రూఫ్‌టాప్ షీట్‌లు, ఎల్ఈడీ లైట్లు, ఆకర్షణీయమైన టైల్స్‌తో ఫ్లోరింగ్, బస్సు వచ్చి వెళ్లేలా బీటీతో



జాతీయ రహదారిపై సౌత్ ఎంఎంటీసీ పాలెం బస్‌బే

... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి ఆటోమ్యుటేషన్

- స్థిరాస్తి రిజిస్ట్రేషన్ అయిన వెంటనే జీవీఎంసీ రికార్డుల్లో కూడా పేరు మార్పు
- ఆస్తి పన్ను, నీటి పన్ను అన్నీ ఒకే క్లిక్‌తో...



విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నంలో స్థిరాస్తి కొనుగోలుదారులకు శుక్రవారం నుంచి ఆటోమ్యుటేషన్ విధానం అమలు కానుంది. అంటే ఏదైనా స్థిరాస్తి (ఇల్లు లేదా ఫ్లాట్ లేదా ఖాళీ స్థలం) కొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదు చేసుకుంటే... ఆ వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో జీవీఎంసీ అధికారులకు పంపించి, అక్కడ కూడా కొత్త యజమాని పేరు రికార్డుల్లో మారుస్తారు. దీనిని 'మ్యుటేషన్' అంటారు.

ఇప్పటివరకూ ఇలా జీవీసీఎం రికార్డుల్లో పేరు మార్చుకోవాలంటే ప్రత్యేకంగా దరఖాస్తు చేయాల్సి ఉండేది. ఆ పని ఎప్పటికోగాని పూర్తయ్యేది కాదు. యాజమాన్య హక్కుల్లో వివాదాలు వస్తున్నందున, కొనుగోలుదారులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఇప్పుడు 'ఆటో మ్యుటేషన్' విధానం అమలులోకి తీసుకువచ్చింది. ఈ ప్రక్రియలో స్థిరాస్తి అమ్ముతున్న వ్యక్తి ప్రభుత్వానికి ఏమైనా పన్ను బకాయిలు ఉంటే... ఆన్‌లైన్‌లో ఆ వివరాలు చూపిస్తుంది. వాటిని కూడా చెల్లించాకే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. దీనివల్ల భవిష్యత్తులో కొనుగోలుదారులకు ఇబ్బందులు ఉండవు. పాత పన్ను

... మిగతా 6వ పేజీలో

భూమాయ

రామవరం, గంగసాని అగ్రహారం గ్రామాల్లో వీఎంఆర్‌డీఏ చేపట్టిన సమీకరణలో అక్రమాలు

- గతంలో ప్రభుత్వానికి అప్పగించిన భూములకు హక్కుదారులుగా క్లెయిమ్
- కొండ పోరంబోకు భూమికి పట్టాదారులు ఉన్నట్టు సృష్టి
- వైసీపీ నేతల చేతివాటం
- జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు
- విజిలెన్స్ విచారణ

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి):

ఆనందపురం మండలం రామవరం, గంగసాని అగ్రహారంగ్రామాల్లో వీఎంఆర్‌డీఏ కోసం చేపట్టిన భూ సమీకరణలో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయి. గతంలో ప్రభుత్వానికి అప్పగించిన డీపట్టా భూములనే కొందరు తిరిగి క్లెయిమ్ చేసుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై విజిలెన్స్ అధికారులు విచారణ చేస్తుండగా, మరోవైపు గ్రామానికి చెందిన ఒకరు ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు.

మధ్య, ఎగువ తరగతి కోసం టౌన్‌షిప్‌లు అభివృద్ధి చేయాలని వీఎంఆర్‌డీఏ 2018లో ప్రతిపాదించగా అప్పటి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. భూసమీకరణకు 2019 తరువాత అధికారులు రంగం సిద్ధం చేసినా కొంత జాప్యం జరిగి చివరకు 2022లో తుది నోటిఫికేషన్ విడుదల చేశారు. దీని ప్రకారం గత ఏడాది భూసమీకరణకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టారు. రామవరం, గంగసాని అగ్రహారం రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారు 150 మంది రైతులకు చెందిన 264 ఎకరాలను సమీకరించారు. భూములు ఇచ్చిన రైతుల వివరాలతో కూడిన నోటిఫికేషన్‌ను రెవెన్యూ అధికారులు ఇటీవల విడుదల చేశామని చెప్పినా చేయలేదని ఫిర్యాదులు వచ్చాయి. రైతుల్లో పలు అనుమానాలు వ్యక్తమం కావడంతో చివరకు నోటిఫికేషన్ వివరాలు వెల్లడించారు.

నోటిఫికేషన్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం రామవరం రెవెన్యూ పరిధి సర్వే నంబరు 144/1లో 3.01 ఎకరాలు గతంలో ప్రభుత్వానికి అప్పగించారు. అయితే ఆ భూమికి ఇప్పుడు తిరిగి క్లెయిమ్ చేశారు. అలాగే సర్వే నంబరు 144/2లో 2.87 ఎకరాలను కూడా ప్రభుత్వానికి అప్పగించగా, వాటిని ఇప్పుడు క్లెయిమ్ చేశారు. అయితే ఆనందపురం తహసీల్దారు కార్యాలయంలోని రికార్డులలో సర్వే నంబర్లు 144/1, 2కు సంబంధించి పట్టాదారుల వివరాలు కొట్టి వేసి అక్కడ ప్రభుత్వ భూమిగా నమోదుచేశారు.



రామవరం వద్ద గతంలో ప్రభుత్వానికి అప్పగించిన భూమి

దానిని పట్టించుకోని అధికారులు, సదరు పట్టాదారులకు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకు రాజకీయంగా ఒత్తిడి ఉందనే వాదన వినిపిస్తోంది. ఇంకా సర్వే నంబరు 154/1లో 0.79 ఎకరాలు, 154/5లో 1.19 ఎకరాలకు రెండోసారి క్లెయిమ్ చేశారు. అయితే డీపట్టా తీసుకునే సమయానికి క్లెయిమ్ చేసుకున్న వ్యక్తికి ఏడు సంవత్సరాలు కావడం గమనార్హం. ఇంకా అప్పట్లో డీపట్టా ఇచ్చినప్పుడు ఒక పేరుతో ఉండగా, తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో మరో పేరు నమోదు అయింది. ఇదే గ్రామంలో సర్వే నంబరు 154/9లో 3.96 ఎకరాలను తొలుత కొండ పోరంబోకుగా గుర్తించిన అధికారులు, తాజా నోటిఫికేషన్‌లో ఒక మహిళ పేరిట పట్టా ఉన్నట్టు క్లెయిమ్ చేశారు.

గంగసాని అగ్రహారంలో సర్వే నంబర్లు 67/3,77/4, 91/3,92/1, 92/7లో 6.35 ఎకరాలు ఉంది. రెవెన్యూ నిబంధనల మేరకు ఒక కుటుంబానికి ఐదు ఎకరాల డీపట్టా మాత్రమే

... మిగతా 6వ పేజీలో

ప్రో కబడ్డీకి వేదికగా విశాఖ

- పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో 28 మ్యాచ్‌లు
- ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 11 వరకూ నిర్వహణ

విశాఖపట్నం, స్పోర్ట్సు, జూలై 31 (ఆంధ్రజ్యోతి):



ప్రో కబడ్డీ లీగ్‌కు (పీకేఎల్) విశాఖ ఆతిథ్యమివ్వనున్నది. సీజన్-12 సిరీస్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను పీకేఎల్ యాజమాన్యం గురువారం ప్రకటించారు. ఆగస్టు 29 నుంచి అక్టోబరు 23 వరకు జరగనున్న మెగా టోర్నీలో 108 మ్యాచ్‌లకు జైపూర్, చెన్నై, ఢిల్లీతోపాటు విశాఖలోని పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియాన్ని వేదికగా ఖరారు చేసింది. ఈ టోర్నీలో ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 11 వరకు జరగనున్న 28 మ్యాచ్‌లకు పోర్టు రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా నిలవనున్నది. 14 రోజులపాటు జరగనున్న ఈ మ్యాచ్‌లలో హోమ్ టీమ్ తెలుగు టైటాన్స్‌తోపాటు బెంగాల్ వారియర్స్, బెంగళూరు బుల్స్, దబాంగ్ ఢిల్లీ, గుజరాత్ జెయింట్స్, హరియాణా స్టీలర్స్, జైపూర్ పింక్ పాంథర్స్, పాట్నా పైరేట్స్, పుణేరి పల్టన్, తమిళ్ తలైవాస్, యు ముంబా,

... మిగతా 6వ పేజీలో

రెస్టో బార్ల నిర్మాణం అక్రమం

- నిబంధనలు ఉల్లంఘించినట్టు నిర్ధారించిన జాయింట్ కమిటీ
- విచారణలో పాత నిర్మాణాలని బుకాయింపు
- వివరాలు సమర్పించాల్సిందిగా జీవీఎంసీ ఆదేశం

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి):

విశాఖ-భీమిలి బీచ్‌రోడ్డులో గల ఐదు రెస్టో బార్లు నిబంధనలు అతిక్రమించాయని హైకోర్టు నియమించిన జాయింట్ కమిటీ స్పష్టంచేసింది. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చునని స్పష్టం చేసినట్టు ఫిర్యాదీ పీతల మూర్తి యాదవ్ గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

బి-జాగ్ రెస్టో బార్, తీరం బీచ్ రిసార్ట్, మేర్లిన్ కే రెస్టోబార్, శాంక్చమ్ బీచ్ రిసార్ట్ (తొట్లకొండ బీచ్ రిసార్ట్), విరాగో రెస్టో బార్లపై మూర్తియాదవ్ హైకోర్టులో కేసు వేసిన సంగతి తెలిసిందే. దీనిపై కోర్టు ఆదేశం ప్రకారం జీవీఎంసీ అధికారులు ఆయా రెస్టోబార్లకు నోటీసులు జారీచేసి వివరణ కోరారు. వాటిలో రెండు ఏపీటీడీసీకి చెందినవి కావడంతో ఆ విభాగం అధికారుల వివరణ తీసుకున్నారు.



శాంక్చమ్ బీచ్ రిసార్ట్



విరాగో రెస్టో బార్

బి-జాగ్ నిర్వాహకులు తాము 40 ఏళ్ల క్రితం నిర్మించిన భవనంలో ఉంటున్నామని, 3/4 వంతు మాత్రమే సీఆర్‌జెడ్ పరిధిలో ఉందని, కొత్త నిర్మాణాలు ఏమీ చేపట్టలేదని వివరణ ఇచ్చారు. దాంతో వారిపై కోర్టు స్టేటస్ కో కొనసాగిస్తున్నారు. తీరం బీచ్ రిసార్ట్ నిర్వాహకులు తాము 1982లో ఆస్తి కొనుగోలు చేశామని, పంచాయతీ అనుమతులతో నిర్మాణం చేపట్టామని, కాబట్టి కొత్తగా సీఆర్‌జెడ్ అనుమతుల ప్రస్తావన

... మిగతా 6వ పేజీలో

మండలాలకు ప్రత్యేకాధికారులు


- ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల పర్యవేక్షణకుగాను నియామకం

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల పర్యవేక్షణకుగాను జిల్లా స్థాయి అధికారులను మండలాలకు ప్రత్యేకాధికారులుగా నియమిస్తూ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. భీమిలి మండలానికి భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, ఆనందపురం మండలానికి సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె. రామారావు, పద్మనాభం మండలానికి జాతీయ రహదారుల విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి, విశాఖ రూరల్‌కు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యసుధ, మహారాణిపేటకు విశాఖ ఆర్డీవో శ్రీలేఖను నియమించారు. సీతమ్మధారకు డీసీవో ప్రవీణను, గోపాలపట్నానికి జిల్లా పర్యాటకాధికారి జె.మాధవిని, ములగాడకు డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవిని, గాజువాకకు వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ అధికారి బి.దయానిధిని, పెందుర్తికి జిల్లా హౌసింగ్ మేనేజరు సీహెచ్ సత్తిబాబును, పెదగంట్యాడకు ఉక్కు భూసేకరణ ఎస్డీసీ సునీతను ప్రత్యేకాధికారులుగా నియమించారు. వీరిలో కొందరికి పీ-4 పథకం కోసం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బాధ్యతలు అప్పగించారు.

సింహగిరిపై పెళ్లిళ్లకు రూ.10 వేలు చార్జి

- గజపతి సత్రం, లోవ తోట సహా ఎంపిక చేసిన ప్రాంతాల్లో అనుమతి
- దేవస్థానం ఈవో వేండ్ర త్రినాథరావు



సింహాచలం, జూలై 31 (ఆంధ్రజ్యోతి):

సింహగిరిపై వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో వివాహం చేసుకోదలచినవారు దేవస్థానానికి పది వేల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని కార్యనిర్వాహణాధికారి వేండ్ర త్రినాథరావు తెలిపారు. గతంలో ఉచితంగానే అనుమతించేవారు. మూడేళ్ల క్రితం టెండర్ పిలిచి కాంట్రాక్టుకు ఇచ్చారు. దేవస్థానం నిర్ణయించిన ధర కంటే ఆ కాంట్రాక్టర్ అధికంగా వసూలు చేస్తూ భక్తులను ఇబ్బంది పెడుతున్నారంటూ హిందూ సంఘాలు ఆందోళనకు దిగాయి. దాంతో అధికారులు కాంట్రాక్టు విధానానికి స్వస్తి చెప్పడానికి సమ్మతించారు. గురువారంతో కాంట్రాక్టు ముగిసింది. ఈ నేపథ్యంలో సింహగిరిపై అనుమతించిన స్థలాల్లో పెళ్లిళ్లు చేసుకోవాలనుకునేవారు రూ.10 వేలు చెల్లించి నెలరోజుల ముందుగానే ఆ ప్రాంతాలను రిజర్వు చేసుకోవాలంటూ ఈఓ ప్రకటన విడుదల చేశారు. తాజా ఆదేశాల ప్రకారం గజపతి సత్రం, పొదాలమ్మ, బంగారమ్మ గుడి ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్రాంతం, లోవ తోట, అదేవిధంగా ప్రత్యేక కండిషన్‌లో

... మిగతా 6వ పేజీలో

సైబర్ ముఠాల చేతిలో తెలుగు యువకులు

- ఐటీ, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలంటూ ఆశపెట్టి థాయ్‌లాండ్ పంపిన ఏజెంట్లు
- చిత్రహింసలు పెట్టి స్కామ్‌లు చేయిస్తున్న ముఠా సభ్యులు
- కాపాడాలంటూ బాధితుల వీడియో

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి):

ఐటీ, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలంటూ ఆశపెట్టి థాయ్‌లాండ్ తీసుకువెళ్లి సైబర్ నేరాలు చేయించే ముఠా చేతిలో నగరంతోపాటు వివిధ జిల్లాలకు చెందిన తెలుగు యువకులు చిక్కుపోయారు. తమను ముఠా సభ్యులు చిత్రహింసలకు గురిచేస్తున్నందున కాపాడాలంటూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి సెల్ఫీ వీడియో విడుదల చేశారు. అందులో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి.

నగరంలోని గోపాలపట్నం ప్రాంతంతోపాటు విజయనగరం, కడప, తదితర ఇతర జిల్లాలకు చెందిన సుమారు 15 మంది యువకులు ఉద్యోగాల



థాయ్‌లాండ్‌లో చిక్కుకున్న యువకులు

కోసం నెల కిందట థాయ్‌లాండ్ వెళ్లారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్, కంపెనీలో రిసెప్షన్, హోటల్‌లో ఉద్యోగాలు ఉన్నాయంటూ ఏజెంట్లు నమ్మించడంతో మొదట ముగ్గురు వెళ్లారు. వారికి డేటా ఎంట్రీ ఆపరేటర్, హోటల్‌లో, రిసెప్షన్ ఉద్యోగాలు ఇచ్చినట్టు ముఠా సభ్యులు నమ్మించారు. 15 రోజులు వరకూ వారిని బాగానే చూసుకోవడంతో వారి ద్వారా వారి స్నేహితులైన మరో 12 మంది పదిహేను రోజుల కిందట థాయ్‌లాండ్ వెళ్లారు. అక్కడకు 12 మంది చేరిన తర్వాత, ముందు వెళ్లిన ముగ్గురిని కలిపి వేరొకచోట ఉద్యోగం చేయాల్సి ఉంటుందని వారి పాస్‌పోర్టులు

... మిగతా 6వ పేజీలో



బస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్. చిత్రంలో ఆర్ఎం అప్పలనాయుడు ఉన్నారు.

ద్వారకా బస్‌స్టేషన్‌లో కలెక్టర్ తనిఖీలు

- బస్సుల వేళలు, నిర్వహణ పరిశీలన
- ప్రయాణికులకు అందుతున్న సదుపాయాలపై ఆరా
- బస్సులను శుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచన

ద్వారకా బస్‌స్టేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి):

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ గురువారం ద్వారకా బస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్సుల వేళలకు సంబంధించిన సమాచార పట్టికను పరిశీలించారు. షెడ్యూల్ సమయంలో బస్సులు తిరుగుతున్నాయా లేదా అని ట్రాఫిక్ నియంత్రణ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికుల డిమాండ్‌కు తగ్గట్టు బస్సులు ఉన్నాయా లేదా అని రీజనల్ మేనేజర్‌ను అడిగారు. కాంప్లెక్సుకు వచ్చిన బస్సులను పరిశీలించి వాటి నిర్వాహణ తీరు గురించి అధికారులను అడిగారు. కాంప్లెక్స్‌లో పే అండ్ యూజ్ మరుగుదొడ్ల సముదాయాలను, వెలుపల ఉన్న పబ్లిక్ మరుగుదొడ్ల సముదాయాలను, వాటి నిర్వాహణ తీరును పరిశీలించారు. టిక్కెట్ కౌంటర్లు, కౌంటర్ల దగ్గర క్యూలో నిలుచున్న ప్రయాణికులకు ఫ్యాన్‌లు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. కాంప్లెక్సులో తాగునీటి సదుపాయాన్ని, ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను, వాటి పనితీరును పరిశీలించారు. బస్

... మిగతా 6వ పేజీలో

ప్రహ్లాద వరదునికి పసిడి కుసుమార్చన



సింహాచలం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : వరాహనారసింహునికి ఆర్జిత సేవల్లో భాగంగా పసిడి కుసుమార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. పద్మనిధి నుంచి పసిడి కుసుమాలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పిం చి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతినామానికి పసిడి కుసుమాలతో అర్చనలు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

సచివాలయాలకు చెత్త సేకరణ రిక్షాలు



చిప్పాడ సచివాలయానికి వితరణగా ఇచ్చిన రిక్షాలు

భీమునిపట్నం (రూరల్), జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పాడ దివీస్ కంపెనీ పలు గ్రామ సచివాలయాలకు చెత్త సేకరణ రిక్షాలను వితరణగా అందించింది. చిప్పాడ సచివాలయం వద్ద గురువారం వీటిని ఆయా పంచాయతీలకు పంపిణీ చేశారు. చిప్పాడకు 4, పెద నాగమయ్యపాలేనికి 3, మూలకుద్దుకు 3, తూడెంకు 3, లింగాలవలసకు 2, గుడివాడ, చెరుకుపల్లి, నగరపాలెం పంచాయతీలకు రెండేసి రిక్షాలను ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దివీస్ కంపెనీ సీఎస్ఆర్ మేనేజరు డి. సురేష్‌కుమార్, కె. నరసింహ, శ్రీనివాస్, శేఖర్‌బాబు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

బోధనేతర పనులతో ఇబ్బందులు

పద్మనాభం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించొద్దని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన అనంతవరం, గొల్లలపాలెం, గంధవరం పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేసి, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. వచ్చే నెల 2న జరిగే ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆయనతో పాటు ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు మహేశ్, ఆదిబాబు, ఉమాదేవి, రమణ, సత్యం ఉన్నారు.

ప్రణాళిక లేని విభాగం

- పట్టణంలో అస్తవ్యస్తంగా డ్రైనేజీలు
- ఆక్రమణలతో కొన్నిచోట్ల మూసివేత
- స్పందించని టౌన్ ప్లానింగ్ అధికారులు
- వర్షం పడితే రోడ్లు, వీధుల్లోకి మురుగు నీరు



మెయిన్ రోడ్డులో పెట్రోల్ బంకు వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు

భీమునిపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కొందరు కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో పూడికతీతకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షం పడితే కాలువల్లోని మురుగు నీరు రోడ్లు, వీధుల్లో ప్రవహిస్తోంది. ఆక్రమణలపై చర్యలు తీసుకోవాల్సిన పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద పది రోజులుగా డ్రైనేజీలోని మురుగునీరు రోడ్డుపైకి వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి పారిశుధ్య విభాగం అధికారులు నానా తంటాలు పడుతున్నారు. వారం రోజులుగా భూగర్భ కాలువ ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి పారిశుధ్య విభాగం, యూజీడీ అధికారులు పది చోట్ల తవ్వకాలు చేపట్టినా.. జాడ తెలియలేదు. చాలాచోట్ల కాలువలు, గెడ్డలను కప్పి వేస్తున్నప్పుడు టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. దీంతో కాలువలు, గెడ్డలు మూసుకుపోయి రోడ్లపై మురుగునీరు ప్రవహించడం, చినుకు పడితే రోడ్లు వర్షం నీటితో నిండిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువలు, గెడ్డలు ఆక్రమణకు గురైనప్పుడు టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకుంటే ఈ సమస్య తలెత్తేది కాదు. వారు నిర్లక్ష్యంగా ఉండడంతో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఇటీవల ఓ వ్యక్తి బోరు తవ్వించారు. ఇసుకతో కూడిన వృథా నీరు కాలువ ద్వారా వెళ్లిందని, ఆ ఇసుకే కాలువలో మేట వేసి ఉండొచ్చని స్థానికులు చెబుతున్నారు. ఈ కారణంగానే కాలువ మూసుకుపోయిందని అంటున్నారు. కాగా గురువారం ఆలయానికి పడమర భాగంలో ఉన్న ఆర్యన్ ఫ్యూయల్స్ పెట్రోల్ బంక్ పక్కన జీవీఎంసీ సిబ్బంది యంత్రాలతో పలకలను తొలగించి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీని పరిశీలించారు.ఇప్పటివరకు ఆరు అడుగులు లోతు తవ్వామని, మరో తొమ్మిది అడుగులు తవ్వుతామని జోనల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. మహాలక్ష్మీనాయుడు చెప్పారు. కాలువ మొత్తం మెయిన్ రోడ్ నుంచి ఆంజనేయస్వామి ఆలయం రోడ్ వరకూ సిమెంట్ పలకలు తీసివేస్తామన్నారు.



చిట్టివలసలో వెంకటలక్ష్మిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



పీటర్‌ను సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ విజయకుమార్, ఎం‌ఈ‌ఓలు రమణ, బాబూలాల్, ఎంపీపీ రాంబాబు, తదితరులు

రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం

తగరపువలస, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని పుట్రేవు వెంకటలక్ష్మి రిటైర్ కావడంతో విద్యార్థినులు, గ్రామస్తులు గురువారం ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయినిగా వెంకటలక్ష్మి పదేళ్లుగా పాఠశాల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. కాగా ఉపాధ్యాయిని పాఠశాలను విడిచే సమయంలో బాలికల ఆమెను వెళ్లొద్దంటూ బతిమిలాడారు. కొందరు కన్నీరు పెట్టుకున్నారు. వారిని సముదాయించి అవసరమైనప్పుడు మళ్లీ పాఠశాలకు వస్తానని చెప్పి ఆమె వీడ్కోలు తీసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి. శివజ్యోతి, మురళీ మోహన్‌రావు, ఉపాధ్యాయులు సత్యవతి, పద్మ, సావిత్రి, భాగ్యవతి, రామలక్ష్మి, భీమాబాయి తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : తునివలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎం. పీటర్ రిటైర్డ్ కావడంతో పద్మనాభంలోని జెడ్పీ అతిథి గృహంలో ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం అవనాపు అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయకుమార్, మండల విద్యాశాఖాధికారులు రమణ, బాబూలాల్, ఎంపీపీ కె. రాంబాబు, జెడ్పీ వైస్ ఛైర్మన్ గిరిబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, మాజీ సర్పంచులు ఆర్‌ఎఎన్ మూర్తి, మహేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అప్పారావు, నారాయణరావు, మురళి, గోపీనాథ్, జగదీష్‌బాబు, మహేశ్, ఎంవీఎస్ రెడ్డి, మోహన్ , తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు

నగరపాలెంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

భీమునిపట్నం (రూరల్), జూలై 31 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేస్తుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం నగరపాలెంలో జరిగిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి పథకాలను వివరించడంతో పాటు ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులను తెలిపారు. నియోజకవర్గానికి కొత్తగా 789 వితంతు పింఛన్లు మంజూరయ్యాయని చెప్పారు. అంతకముందు ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, టీడీపీ మండల అధ్యక్షుడు డీఏఎన్ రాజు పొట్నూరి రాము, దువ్వి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి కాలనీలో...

కొమ్మాది : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ ఉన్న నాయకుడు అని మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు అన్నారు. గురువారం ఆరో వార్డు అమరావతి కాలనీలో జరిగిన 'తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గరే గురునాథ్, రెడ్డి సత్యనారాయణ, పోలిశెట్టి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నామరూపాల్లేని బస్‌బేలు

... 5వ పేజీ తరువాయి

బస్‌బేలు నిర్మాణం, ప్రయాణికులు కూర్చొనేందుకు బెంచీలు, ఫ్యాన్‌లు, తాగునీరు సదుపాయంతోపాటు ఆ ప్రాంతం పేరు తెలిసేలా ఎల్‌ఈడీ నేమ్‌ప్లేట్‌లు ఏర్పాటుచేశారు. పగటిపూటే కాకుండా రాత్రివేళల్లో కూడా చూసేవారిని ఆకట్టుకునేలా బస్‌బేలను అభివృద్ధి చేశారు. అయితే వీటిని నిర్వహించడంలో జీవీఎంసీ, ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో రాత్రివేళ ఆకతాయిలు వాటిల్లో చేరి ఫ్యాన్లు, లైట్లను తీసుకువెళ్లిపోవడం, ఎలివేషన్ బోర్డులను పీకేయడం చేస్తున్నారు. అదేవిధంగా నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో కొన్నిచోట్ల షీట్లు ఊడి వేలాడుతున్నాయి. దీంతో ప్రయాణికులు వాటిల్లో కూర్చొనేందుకు కూడా అవకాశం ఉండడం లేదు. ఇంతవరకు స్మార్ట్ లుక్‌తో అందరినీ కట్టిపడేసిన బస్‌బేలు ఇప్పుడు అందవిహీనంగా దర్శనమిస్తున్నాయి. రూ.కోట్లు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన బస్‌బేలు రెండేళ్ల తిరిగేసరికి మూలకు చేరిపోవడంపై నగరవాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఏదైనా అభివృద్ధి చేసినప్పుడు దానిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత తీసుకోవాలన్న విషయాన్ని జీవీఎంసీ, ఆర్టీసీ శాఖలు విస్మరించడం దారుణమని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా బస్టాప్‌ల నిర్వహణపై దృష్టిసారించాలని డిమాండ్ చేస్తున్నారు.

సైబర్ ముఠాల చేతిలో తెలుగు యువకులు

... 5వ పేజీ తరువాయి

తీసుకుని వాహనాలు ఎక్కించారు. వారి కళ్లకు గంతలు కట్టి సుమారు 15 వాహనాలు మార్చి, ఒకటిన్నర రోజులు వాహనాల్లోనే వేర్వేరు ప్రాంతాలు తిప్పారు. చివరకు ఆనవాళ్లు కూడా తెలియని ఒకచోట గదిలో ఉంచారు. ఎక్కడకు తీసుకువచ్చారని ముఠా సభ్యులను ఇద్దరు యువకులు ప్రశ్నించగా చైనా జాతీయుల మాదిరిగా ఉన్న కొందరువచ్చి వారిని కొట్టడంతో అందరూ భయభ్రాంతులకు గురయ్యారు. అందరూ ఆడవారి గొంతుతో ఫోన్‌లో మాట్లాడి సైబర్‌స్కామ్ చేయాలని ఆదేశించారు. తమకు అంతగా ఇంగ్లీష్‌రాదని, చాటింగ్ కూడా సరిగా చేయలేమని ఒక యువకుడు చెప్పగా, అతడిని గదిలోకి తీసుకువెళ్లి ఇనుప హాకీ స్టిక్‌తో రక్తం వచ్చేలా కొట్టారు. దీంతో అందరూ భయపడి సైబర్‌స్కామ్ చేయడం ప్రారంభించారు. రోజుకు మొదట 16 గంటలు, తర్వాత 18 గంటలు, తర్వాత 20 గంటలు పనిచేయాలని చెప్పడంతో వారం గడిచేసరికి తాము చేయలేమని చేతులెత్తేయగా కొట్టడంతోపాటు దుస్తులు విప్పించి చిత్రహింసలకు గురిచేశారు. తాము ఇంకా వారి వేధింపులను తట్టుకోలేమని, ఫోన్ చేయడానికి కూడా అవకాశం లేకుండా ఒకరు కాపలా ఉంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తాము ఉంటున్న లోకేషన్‌ను పంపిస్తామని, ఆ ముఠా చేతుల్లో నుంచి తమను రక్షించి ఇండియా వచ్చేలా చేయాలని పవన్‌కల్యాణ్‌ను వేడుకున్నారు. ఇంతలో ఎవరో వస్తున్నట్టు చప్పుడు కావడంతో వీడియోను ఆపేశారు. అయితే వీడియోలో మాట్లాడిన వారి పూర్తి వివరాలు మాత్రం తెలియలేదు. దీనిపై ఇప్పటికే నగర పోలీసులు దృష్టిసారించి వారిని గుర్తించే ప్రయత్నాలు ప్రారంభించినట్టు తెలిసింది.

ప్రో కబడ్డీకి వేదికగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

యుపీ యోధా...మొత్తం 12 జట్లు తలపడనున్నాయి.

దాదాపు ఏడేళ్ల తర్వాత

2014లో ఇండియన్ ప్రొఫెషనల్ కబడ్డీ లీగ్ తొలి సీజన్ టోర్నీ విశాఖ నుంచే ప్రారంభం కావడం విశేషం. తెలుగు టైటాన్స్ హోమ్ టీమ్‌గా ఆగస్టు 16 నుంచి 19 వరకూ జరిగిన ఏడు మ్యాచ్‌లకు పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం వేదికైంది. ఆ తర్వాత పీకేఎల్ సీజన్-3 టోర్నీకి సంబంధించి 2016లో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 2 వరకూమరో ఏడు మ్యాచ్‌లు జరిగాయి. చివరిగా పీకేఎల్ సీజన్-6కు సంబంధించి 2018లో డిసెంబరు 7 నుంచి 13 వరకూ జరిగిన 11 మ్యాచ్‌లకు పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా నిలిచింది. ఆ తర్వాత జరిగిన సీజన్లకు తెలుగు టైటాన్స్ యాజమాన్యం హోమ్ గ్రౌండ్‌గా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియాన్ని వేదిక చేసుకున్నది. దాదాపు ఏడేళ్ల తర్వాత ఈ ఏడాది ఆగస్టు 29 నుంచి జరగనున్న పీకేఎల్ సీజన్-12 టోర్నీకి విశాఖ ఆతిథ్యమివ్వనుంది.

ద్వారకా బస్‌స్టేషన్‌లో కలెక్టర్ తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

కాంప్లెక్స్‌లోని స్టాళ్లను పరిశీలించి అన్ని రకాల ఐటమ్స్ ఎంఆర్‌పీకి అమ్ముతున్నారా లేదా అని ఆరా తీశారు. కాంప్లెక్సు నిర్వాహణపై కలెక్టర్ సంతృప్తిని వ్యక్తంచేశారు. బస్సుల్లో కిటికీ కర్టెన్స్‌ను తరచూ మారుస్తూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.పద్మావతి, సెక్యూరిటీ ఆఫీసర్ ఐవీవీపీ దుర్గాప్రసాద్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ నాయుడు, పలువురు అధికారులు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

రెస్టో బార్ల నిర్మాణం అక్రమం

... 5వ పేజీ తరువాయి

తమకు తెలియదని బకాయించారు. విరాగో రెస్టో బార్ నిర్వాహకులు తాము కేవలం లీజుదారులమేనని పేర్కొన్నారు. అయితే ఆ భూమికి సంబంధించిన డాక్యుమెంట్, ఈసీ కాపీ, 30అడుగుల మాస్టర్‌ప్లాన్ రహదారి, భవనం డ్రాయింగ్ అన్నీ సమర్పించాలని జీవీఎంసీ అధికారులు ఆదేశించారు. ఈ వివరణలన్నీ హైకోర్టుకు సమర్పించి, అక్కడ నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. హైకోర్టులో కమిటీ నివేదిక కూడా ఉన్నందున చర్యలకు సిఫారసు చేసే అవకాశం ఉందని మూర్తియాదవ్ పేర్కొన్నారు.

సింహగిరిపై పెళ్లిళ్లకు రూ.10 వేలు చార్జి

... 5వ పేజీ తరువాయి

అధికారులు సమ్మతించిన స్థలాల్లో వివాహాలకు అనుమతిస్తారు. వివాహం తరువాత మూడు గంటలలోపు అందుకు వాడిన కుర్చీలు, మండపాలు, సోఫాలు, తదితరాలను అక్కడ నుంచి ఖాళీ చేయాలి. వివాహం చేసుకోదలచిన వారి నుంచి పారిశుధ్యం నిమిత్తం రూ.2 వేలు, అడ్వాన్స్ రూపంలో రూ.5 వేలు వసూలు చేసి పెళ్లి అనంతరం తిరిగి ఇచ్చే విధంగా పీఆర్‌ఓ కార్యాలయంలో సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని ఈఓ ఆదేశించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : భీమిలి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ భీమిలి టౌన్, 11 కేవీ భీమిలి రూరల్ ఫీడర్‌లో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖాధికారులు తెలిపారు. బ్యాంకుకాలనీ, తాతాజీనగర్, యల్లమ్మపేట, మహాలక్ష్మీపురం, డెక్కతిపాలెం, రాజలింగపేట, రేఖవానిపాలెం, రాయపాలెం, మరడపాలెం, మూలకుద్దు, భీమిలి పట్టణానికి సరఫరా ఉండదన్నారు.

సాగర్‌నగర్ పరిధిలో..

సాగర్‌నగర్ : ఆదిభట్లనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దసపల్లా లేఅవుట్ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని జోన్ త్రీ ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. సుభాష్‌నగర్, ముసలయ్యపాలెం, తాటిచెట్లపాలెం, దసపల్లా లేఅవుట్ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

కొమ్మాదిలో...

కొమ్మాది : కొమ్మాది విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సేవానగర్ 11 కేవీ ఫీడర్ నిర్వహణ కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ నరేశ్ తెలిపారు. కొమ్మాది జంక్షన్, శ్రీనివాసనగర్, సాయిరాం కాలనీ, జీసీసీ లేఅవుట్, టీచర్స్ కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీ, అమరావతి కాలనీ, సేవానగర్, డ్రైవర్స్ కాలనీ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

పద్మనాభం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 22 పంచాయతీల్లో ఉన్న 16 సచివాలయల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన పద్మనాభం, కృష్ణాపురం సచివాలయాలను సందర్శించి, పింఛన్ల పంపిణీపై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఏషియన్ రోలర్ స్కేటింగ్‌లో వెల్లంకి బాలుడికి పతకాలు



ఆనందపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి) : సౌత్ కొరియాలో ఈనెల 29వ తేదీన జరిగిన 20వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన గొలగాని దినేశ్ (14) సత్తా చాటాడు. ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో వెండి పతకం, వ్యక్తిగత విభాగంలో వెండి పతకం సాధించాడు. 2023లో చైనాలో జరిగిన 19వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో కూడా వెండి పతకం సాధించాడు. ఇప్పటివరకు జాతీయ స్థాయిలో ఆరు బంగారు పతకాలు, రాష్ట్రస్థాయిలో 15 బంగారు పతకాలు, జిల్లాస్థాయిలో 18 బంగారు పతకాలు పొందాడు. ఒలింపిక్స్‌లో దేశానికి బంగారు పతకం సాధించడమే తన లక్ష్యమని దినేశ్ తెలిపాడు. బాలుడ్ని కోచ్‌లు సత్యం, చిట్టిబాబు, గ్రామస్తులు అభినందించారు.

వైసీపీకి పాలవలస ఎంపీటీసీ సభ్యురాలి రాజీనామా



మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యురాలు శ్యామల

ఆనందపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలవలస ఎంపీటీసీ సభ్యురాలు రౌతు శ్యామల వైసీపీకి రాజీనామా చేశారు. గురువారం టీడీపీ సీనియర్ నాయకులు కాకర్లపూడి వరహాలరాజు, శ్రీకాంత్‌రాజు నివాసంలో సమావేశం ఏర్పాటు చేసి, వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుంచి నమ్మకంతో పని చేస్తున్నా.. గుర్తింపు లభించలేదన్నారు. ప్రజలకు సేవల చేయాలన్న తలంపుతో ఎంపీటీసీగా పోటీ చేశానని, 2019 - 2024 వరకు తమ గ్రామం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనులు కావాలని అడిగితే కనీసం పట్టించుకునే నాథుడే లేరన్నారు. కూటమి హయాంలో అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకంతో టీడీపీలో చేరుతున్నట్టు తెలిపారు. అలాగే నేల్తేరు వైసీపీ నాయకులు రైతు వెంకటరావు, పాలవలస ఉప సర్పంచ్ చందక ఎల్లారావు, గండిగుండం నాయకులు మదపాడ శ్రీనివాసరావు, గండిగుండం మాజీ వార్డు మెంబరు సత్తిబాబు, కంచుబోయిన తమ్మునాయుడు, రౌతు పెద వెంకటరావు కూడా వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్టు ప్రకటించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఆబోతు రాము, మదపాడ సత్తిబాబు,పాలవలస అప్పలరాజు పాల్గొన్నారు.



మట్టితో కప్పివేసి చదును చేసిన కాలువ

మురుగు నీటి కాలువ పూడ్చివేత

తగరపువలస, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బంగ్లామెట్ట వద్ద 50 ఏళ్లుగా ఉన్న మురుగునీటి కాలువను రియల్ ఎస్టేట్ వ్యాపారులు మూసివేశారు. బంగ్లామెట్ట పరిసర ప్రాంతాలకు చెందిన వాడుక నీరు ఈ కాలువ ద్వారా గోస్తనీ నదిలో కలిసేది. కాలువను మూసి వేయడం వల్ల మురుగు నీరు ప్రవహించే అవకాశం లేక ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. కాలువ ఉన్న ప్రాంతం జిరాయితీ భూమి కావడంతో సమీపంలో స్థలాలు కొనుగోలు చేసిన వారు మట్టితో కాలువను మూసివేసి చదును చేశారు. దీంతో కాలువ ద్వారా ప్రవహించే మురుగు, వాడుక నీరు నదిలో చేరకుండా ఎక్కడికక్కడ నిలిచిపోతుండడంతో విపరీతమైన దుర్వాసన వస్తోంది. స్థానికులు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, ఎవరూ స్పందిం చడం లేదు.

స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలి

వామపక్షాల డిమాండ్



గ్రామాల్లో ప్రచారం చేస్తున్న నాయకులు

మధురవాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. మధురవాడలో గురువారం సీపీఐ, సీపీఎం నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మరుపిళ్ల పైడిరాజు, డొడ్డి అప్పలరాజు మాట్లాడుతూ ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు బిగించడం వల్ల ప్రజలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. ఎన్నికల హామీలకు కూటమి ప్రభుత్వం తిలోదకం ఇచ్చి విద్యుత్ చార్జీలు పెంపు భారాన్ని ప్రజలపై వేయడం అన్యాయమన్నారు. విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించనట్లయితే పోరుబాట తప్పదని హెచ్చరించారు.

పద్మనాభం రూరల్ : స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ అనంతవరం, పెంట, కొవ్వాడ గ్రామాల్లో వామపక్షాల నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు ప్రయత్నిస్తే వ్యతిరేకించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక అదే పని చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు ఎస్. అప్పలనాయుడు, కె.సీతాదేవి, పి. సూర్యనారాయణ, ఎం.అప్పారావు, సింగిడి రాము, పద్దు, తదితరులు పాల్గొన్నారు.

భీమిలి ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం

భీమునిపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి కొండ రహదారిలో ఉన్న భీమిలి తాలూకా ఎన్జీవో హోమ్‌లో ఏపీటీఎఫ్ భీమిలి మండల నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. అధ్యక్షుడిగా మహాలక్ష్మినాయుడు, ప్రధాన కార్యదర్శిగా కరుభుక్త సన్యాసినాయుడును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కొటాన శ్రీనివాస్, పరిశీలకులుగా బి.ముత్యాలనాయుడు, డి.దాలయ్యబాబు వ్యవహరించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు 20 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. అలాగే మండలం నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

నాగుపాము కలకలం

భీమునిపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద సమూసాల దుకాణంలో నాగుపాము గురువారం కలకలం సృష్టించింది. జీవీఎంసీ దుకాణంలో ఓ వ్యక్తి సమూసాల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఉదయం పది గంటలకు దుకాణం తెరిచి లోపలకు వెళ్లిన మహిళ పాత్రలు తీస్తుండగా పాము కనిపించింది. వెంటనే ఆటో డ్రైవర్ యర్ర రాము టి. నగరపాలెం గ్రామానికి చెందిన స్నేక్ కేచర్ కొమర కొండలరావుకు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి పామును పట్టుకోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

58 మంది పేదలు గుర్తింపు

సాగర్‌నగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పేదల గుర్తింపునకు చేపట్టిన పీ 4 సర్వేలో అధికారులు 58 మంది పేదలను గుర్తించారు. సాగర్‌నగర్‌లో ఉన్న 56వ సచివాలయం పరిధిలో 30 మందిని, 57వ సచివాలయం పరిధిలో 28 మందిని ఎంపిక చేశారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా సహాయం చేయడంతో పాటు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తారు. కాగా సచివాలయాల సిబ్బంది సర్వేను హడావిడిగా పూర్తిచేశారు. బదిలీల సమయం కావడంతో తూతూ మంత్రంగా సర్వే జరిపారు. తగు జాగ్రత్తలతో సర్వే చేసి వుంటే మరికొంత మంది పేదలు జాబితాలో చేరేవారు.

ఉమా నారాయణ ఫౌండేషన్ దాతృత్వం

ఆనందపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్‌వీపాలెం పంచాయతీలో ఉన్న ఉమా నారాయణ ఫౌండేషన్ దాతృత్వం చాటుకుంది. ఇటీవల జరిగిన ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరంలో 18 మందికి నేత్ర శస్త్ర చికిత్స అవసరం కాగా వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసింది. అలాగే 12 మందికి దంత సమస్యలు ఉన్నట్టు గుర్తించి రూట్ కెనాల్ చికిత్స అందించారు. 108 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. గురువారం ఎల్‌వీపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ చింతా వాసునాయుడు, టీడీపీ నాయకులు ఘట్టమనేని సుభాష్‌చంద్రబోస్ శస్త్ర చికిత్స చేసుకున్న వారికి కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తారక్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆటోమ్యుటేషన్

... 5వ పేజీ తరువాయి

బకాయిలు కట్టాలని నోటీసులు ఏమీ రావు. దీంతో పాటు కొళాయి కనెక్షన్ పేరు కూడా రికార్డుల్లో మారుతుంది. దశల వారీగా విద్యుత్ మీటరు పేరు కూడా మార్చడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతానికి జీవీఎంసీ, రిజిస్ట్రేషన్ల శాఖ రికార్డులను లింక్ చేశారు. త్వరలో సంబంధిత విభాగాలతోను అనుసంధానం చేయనున్నారు.

భూమాయ

... 5వ పేజీ తరువాయి

ఇస్తారు. దీనికి అనుగుణంగా ఆనందపురం రెవెన్యూ అధికారులు ఐదు ఎకరాలు విడిచిపెట్టి మిగిలిన 1.35 ఎకరాలు స్వాధీనం చేసుకున్నారు. అయితే సదరు వ్యక్తులు 6.35 ఎకరాలకు క్లెయిమ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో వైసీపీ నేతల హస్తం ఉందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై గ్రామానికి చెందిన ఒకరు...ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భూ సమీకరణకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన, నారసింహ హోమం



విశేష అలంకరణలో సుదర్శన స్వామి

ఎంవీపీ కాలనీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరు వేంకటేశ్వరస్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో గురువారం సుదర్శన, నారసింహ హోమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సుదర్శన జయంతి సందర్భంగా భారీగా హాజరైన భక్తుల మధ్య ప్రథమారాధన, పంచామృతాభిషేకాలు, విష్వక్సేనారాధన, మండలారాధన, యోగశాల ప్రవేశం, సుదర్శన శతకం, నారసింహ శ్రీలక్ష్మీ పావనం, పూర్ణాహుతితో కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు లక్ష్మణస్వామి, శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజలను ఆలయ కమిటీ కార్యదర్శి ప్రసాదరావు పర్యవేక్షించారు.

కోతిచేష్టలతో ఇబ్బందులు



దీనదయాళ్‌పురంలో హల్‌చల్ చేస్తున్న వానరం

ఆరిలోవ, జూలై31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో ఒక కోతి చాలా ఇబ్బంది పెడుతుందంటూస్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లల్లోకి ప్రవేశించి సామగ్రి చిందరవందర చేయడం, పనుల్లో నిమగ్నమై ఉన్న తరుణంలో మనుషుల పైకి దూకి గోళ్లతో రక్కడం, పెరట్లో ఉంటే కూరగాయల పాదులు, అరటి, బొప్పాయి, జామ తదితర పంటలను నాశనం చేస్తోందని చెబుతున్నారు. ఈ కోతి వల్ల ఇప్పటికై పలువురు గాయాల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని బారి నుంచి రక్షించాలని కోరుతున్నారు.

13వ వార్డులో 'తొలి అడుగు'

ఆరిలోవ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. గత 13 నెలలుగా చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమం గురించి టీడీపీ నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ప్రజల నుండి మంచి స్పందన వచ్చిందని కార్పొరేటర్ సునీత అన్నారు. అనంతరం ఆమె వార్డులో జరుగుతున్న అభివృద్ధిపనులను పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 48, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 44, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 32, బీరకాయలు 48, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 48,దొండకాయలు 42, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 66, బరబాటి 46, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 38, చిలగడదుంపలు 44, కంద 42, దేముడుచిక్కుడు 98, గోరుచిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	460
విజయనగరం	464
శ్రీకాకుళం	464

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	83
లైవ్ ధర	103
విత్ స్కిన్	176
స్కిన్‌లెస్	186

కాలువకు మరమ్మతు మాటే మరిచారు!

- నెలల తరబడి పూడికతీత ఊసే లేదు
- రక్షణ గోడల నిర్మాణం గురించి పట్టించుకునే వారే లేరు
- దోమలు, దుర్గంధంతో శ్రీకాంత్‌నగర్ వాసుల విలవిల



పూడిక తీత చేపట్టక, రిటైనింగ్ వాల్స్ లేకపోవడంతో అధ్వానంగా ఉన్న ప్రధాన కాలువ

ఆరిలోవ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులోని శ్రీకాంత్‌నగర్ 4వ లైన్‌లో గల ప్రధాన కాలువలో పూడిక దట్టంగా పేరుకుపోయి ఉంది. దీంతో దోమల విపరీతంగా విజృంభిస్తున్నాయి. నెలల తరబడి పూడిక తొలగింపు చేపట్టకపోవడంతో చెత్తాచెదారం కుళ్లిపోయి పరిసరాలు దుర్గంధంతో నిండిపోయాయి. ఇటువైపు వెళ్లాలంటేనే ముక్కు మూసుకుని వెళాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు విపరీతంగా ఉండడం వల్ల ఎప్పుడు ఏ రోగాలు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు.

ఈ కాలువకు మరమ్మతులు చేపట్టి సుమారు 15 ఏళ్లు అవుతున్నాయని స్థానికులు తెలిపారు. ఎలాంటి మరమ్మతులు చేపట్టకుండా, కనీసం పూడికలు తీయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారని, దీనివల్ల తాము ఇబ్బందులకు గురవుతున్నామని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు వినతులు సమర్పించినా పూడిక తీసేందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తెండి, వెంటనే పరిష్కరిస్తామంటూ ప్రజాప్రతినిధులు చెప్పడమే గాని, ఆచరణలో మాత్రం కనిపించడం లేదని విమర్శిస్తున్నారు.

ఈ ప్రధాన కాలువకు రక్షణ గోడలు నిర్మించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రధాన గెడ్డ ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నూతన విభాగాధిపతుల నియామకం



ఏయూ వీసీ రాజశేఖర్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకుంటున్న ప్రొఫెసర్లు ప్రేమానందం, సత్యనారాయణ, సింహాచలం

వెంకోజీపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఏయూ జర్నలిజం మాస్ కమ్యూనికేషన్స్, హిందీ, రంగస్థల విభాగాలకు నూతన విభాగాధిపతులు గురువారం నియామకం అయ్యారు. జర్నలిజం మాస్ కమ్యూనికేషన్స్ విభాగాధిపతిగా పి.ప్రేమానందం, హిందీ విభాగాధిపతిగా ఎస్.సత్యనారాయణ, థియేటర్ ఆర్ట్స్ విభాగాధిపతిగా డి.సింహాచలంను నియమిస్తూ ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా నూతన విభాగాధిపతులకు ఏయూ వీసీ, పలువురు ప్రొఫెసర్లు శుభాకాంక్షలు తెలియజేశారు.

రైతుబజార్‌ను సందర్శించిన మార్కెటింగ్ శాఖ డైరెక్టర్లు



ఎంవీపీ రైతు బజార్ సందర్శించి సూచనలిస్తున్న మార్కెటింగ్ శాఖ డైరెక్టర్లు శోభ, తాతారావు

ఎంవీపీ కాలనీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ రైతు బజార్‌ను మార్కెటింగ్ శాఖ డైరెక్టర్లు శోభ, తాతారావు గురువారం సందర్శించారు. ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. బజార్‌లో సౌకర్యాలు, సమస్యలపై ఆరా తీశారు. కొనుగోలుదారులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాల్సిన బాధ్యత రైతు బజార్ అధికారులతో పాటు రైతులపై కూడా ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు రైతు బజార్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. ఎస్టేట్ అధికారి కె.వరహాలు, సహాయ అధికారి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పాల్గొన్న కార్పొరేటర్ అప్పలకొండ, టీడీపీ నేతలు

రామ్‌నగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 28వ వార్డులో ఫేకర్ లే అవుట్ వద్ద సుమారు రూ.60 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కొనసాగుతుందన్నారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ గత వారం రోజులుగా ఈ వార్డులో రూ.కోటి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినట్టు తెలిపారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, టీడీపీ వార్డు అధ్యక్షుడు నక్కా కనకరాజు, వైసీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, వార్డు నాయకులు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు

వసతిగృహాలను సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయపసేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

ఆరిలోవ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బాలికలకు అత్యవసర సమయాల్లో తక్షణమే వైద్య సహాయం అందేలా చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు పేర్కొన్నారు. ఆయన గురువారం విశాఖ వేలి స్కూలు సమీపంలో గల ప్రభుత్వ బాలికల (సదనం) గృహాన్ని సందర్శించారు. బాలికలకు కల్పిస్తున్నసౌకర్యాల గురించి ఆయన ఆరా తీశారు. వారికి అందిస్తున్న ఆహారం, పరిశుభ్రత, వైద్యసేవలు, విద్యా సౌకర్యాల, భద్రత, తదితర అంశాలను ఆయన పరిశీలించారు. హాస్టల్ నిర్వాహణకు సంబంధించి పలు సూచనలు అందించారు. బాలికలకు పౌష్టికాహారం అందించాలని పరిశుభ్ర వాతావరణం ఉండే విధంగా చూడాలని ఆయన సూపరింటెండెంట్ నయోమిని ఆదేశించారు.

అనంతరం ఆయన చినగదిలి మండల తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో గల సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలుర వసతి గృహాన్ని సందర్శించారు.. అక్కడ విద్యార్థులకు కల్పిస్తున్న వసతి, ఆహారం, పారిశుధ్యం, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. వార్డెన్‌తో మాట్లాడి విద్యార్థుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యల గురించి అడిగారు. ఏవైనా లోపాలు ఉంటే వాటిని వెంటనే సరిదిద్దాలని సూచించారు.

ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసిన అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు గురువారం లేఖ రాశారు. ప్లాంటులో ఉపాధి కోసం నిర్వాసితులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని,ఈ క్రమంలో కాంట్రాక్టు పనులు చేస్తున్న నిర్వాసితులను కూడా విధుల నుంచి తొలగిస్తున్నారని పేర్కొన్నారు.

ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను ఉక్కు యాజమాన్యం తొలగిస్తుండడంతో ఎంతోమంది కుటుంబాలతో రోడ్డున పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. అలాగే త్వరలో సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లను కలిసి సమస్యను విన్నవిస్తామని వారు పేర్కొన్నారు.

కమిషనర్ సారూ.. ఇదేనా స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర?

- పిఠాపురం కాలనీలో అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- బజార్ ఎదురుగా డ్రైనేజీలో ఏడు వారాలుగా పేరుకుపోయిన చెత్త
- దుర్గంధం, దోమలతో స్థానికుల సతమతం
- వ్యాధుల బారిన పడుతున్నామంటూ గగ్గోలు



పిఠాపురం కాలనీ బజార్ ఎదురుగా డ్రైనేజీలో నిలిచిపోయిన మురుగు, చెత్తాచెదారం

మద్దిలపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : 'విశాఖను పరిశుభ్రంగా ఉంచి దేశంలోనే నంబర్ 1గా తీర్చిదిద్దుతామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానం సాధనకు కృషి చేయాలని పిలుపు ఇస్తుంటారు. నగరం నడి బొడ్డులో మురికికూపల గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. ఇదేనా కమిషనర్ సారూ పరిశుభ్రతపై తీసుకుంటున్న చర్యలు! ఇలానేనా సర్వేక్షణ్‌లో నగరం ప్రథమం కాదు అధమ స్థానంలో ఉంటుంది' అంటూ 22వ వార్డు పిఠాపురం కాలనీ వాసులు గగ్గోలు పెడుతున్నారు.

పిఠాపురం కాలనీ బజార్ ఎదురుగా డ్రైనేజీలో ఏడు వారాల నుంచి మురుగు నిల్వ ఉంటోంది. నిల్వ ఉన్న మురుగు కూపంలా మారి దుర్వాసన వస్తుండడంతో అటుగా రాకపోకలు సాగించే వారు ముక్కులు మూసుకొని వెళ్లాల్సి వస్తోంది. దీనిపై చర్యలు తీసుకునే దాఖలాలే కనిపించడం లేదు. ఇంతవరకూ మురుగును పారిశుధ్య సిబ్బంది తొలగించలేదు. అధికారులు మాత్రం పరిశుభ్రతపై కార్యక్రమాలు చేపడతారు. స్వచ్ఛభారత్ అంటారు. స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర అంటూ ప్రతిజ్ఞలు చేసి ఊదరగొడుతుంటారు. ఏమంటే మన పరిసరాలు మనం శుభ్రంగా పెట్టుకోవాలని కాకమ్మ కథలు చెబుతారు.

కానీ కళ్ల ముందే కనిపిస్తున్న మురుగుపట్టిన కాలువ వీరి కంటికి కనిపించడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలంటారు. అందుకోసం రోజూ ప్రత్యేకంగా ప్రచారం. నగరం నడిబొడ్డులో ఉన్న కాలువలో టన్నుల్లో పేరుకు పోయిన మురుగు గురించి పట్టించుకోకుండా ఒట్టి వాగ్దానాలు ఎందుకంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మురుగుపై 'రయ్..'మంటూ దోమలు చేసే శబ్దం అధికారులకు వినిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లల్లో పూలకుండీలు, డ్రమ్ములు పరిశీలించి నీరు నిల్వ లేకుండా చూడాలని జాగ్రత్తలు చెబుతున్నారు. అంతవరకే నగరపాలక సంస్థ పారిశుధ్య అధికారులు, సిబ్బంది తీరులా ఉందంటూ ఆక్షేపిస్తున్నారు.

రోగాలకు నిలయం..

పిఠాపురం కాలనీ బజార్ ఎదురుగా మురుగు, వ్యర్థాలు నిండిపోయి దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. దీంతో పగలూ రాత్రి నిద్రపట్టే పరిస్థితి లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం 6 గంటలు దాటితే దోమలు దాడి చేస్తున్నాయని వాపోతున్నారు. దోమ కాటుకు గురై వ్యాధుల బారిన పడుతున్నామని మండిపడుతున్నారు. దుర్గంధం వెదజల్లుతున్నా, దోమలు విజృంభించి ప్రజలు అనారోగ్యం పాలవుతున్న జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది మురుగుకూపం వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తానని తెలిపిన జీవీఎంసీ కమిషనర్ అయినా ఈ మురుగు కూపం నుంచి ప్రజలకు విముక్తి కలిగించాలని అంతా కోరుతున్నారు.

సకాలంలో అభివృద్ధి పనులు

- ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్, పాల్గొన్న అధికారులు

వెంకోజీపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నిర్ణీత సమయంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ విభాగాధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ఒప్పందం ప్రకారం జీవీఎంసీ అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలోనే పూర్తి చేయాలని ఆదేశించారు. విశాఖ నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్లు కూడా భాగస్వాములేనని, ప్రతి కాంట్రాక్టర్ వారికి ఇచ్చిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. టెండర్ కాల్ ఫర్ చేసినప్పటి నుంచి పనులు పూర్తయ్యే వరకు పనులలో ఎటువంటి జాప్యం ఉండరాదని స్పష్టం చేశారు. ప్రతి పని రూల్ బుక్ ప్రకారం పూర్తయ్యేలా ప్రతి రోజూ పనులను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయం పరిధిలో రెండు లేదా మూడు వర్కులు ఉంటాయని వాటిని పరిశీలించే బాధ్యత వార్డు ఎమినిటీ కార్యదర్శులను భాగస్వామ్యం చేస్తూ ప్రతి రోజూ ఆయా పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. పనులు నిర్ణయించక ముందే ఆ పనిలో ఆటంకాలను గుర్తించి అన్నీ సరిపోయిన పిదప టెండర్లు పిలవాలన్నారు. పనుల్లో సమస్యలు ఉంటే జోనల్ కమిషనర్, ఆపై అధికారులకు తెలియపరిచాలన్నారు. పనుల ఆలస్యంపై కార్యనిర్వాహక ఇంజనీర్లు ఆరా తీయాలన్నారు. ఇకపై పనులు సకాలంలో పూర్తి అవకపోవడానికి వేరే సాకులను చెప్పరాదని హెచ్చరించారు. ముఖ్యంగా పనులు చేసేటప్పుడే క్వాలిటీ కంట్రోల్ ప్రతినిధులు ఆ పనుల నాణ్యతలో ఎటువంటి రాజీ లేకుండా పని చేయడంతో పాటు ఆ పని మొత్తం నమోదు చేయాలన్నారు. నాణ్యతలో లోపం వలన ఎన్నో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున కాంట్రాక్టర్ వినియోగించే మెటీరియల్‌లను తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. కాంట్రాక్టర్ పనులు పూర్తి చేసిన వెంటనే వరుస క్రమంలో బిల్లులు చెల్లించేందుకు సహకరిస్తామని కమిషనర్ కాంట్రాక్టర్లకు తెలిపారు.

ఈ సందరంగా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు వారి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఎప్పటి నుంచో ఉన్న ఈఎండీలను వెంటనే జారీ చేయాలని, అలాగే పనులు చేసిన పిదప బిల్లుల ప్రక్రియకు వచ్చే సరికి బడ్జెట్ లేదని, ఆ బిల్లును మళ్లీ బిల్లు జనరేట్ అయ్యే వరకు అవుతున్నందు వల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ.. జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మను వాటిని పరిశీలించాలని ఆదేశించారు. సమావేశంలో పర్యవేక్షక ఇంజనీర్లు కేవీఎన్ రవి, పీవీవీ సత్యనారాయరాజు, ఇతర అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఏడాది పాలనపై ప్రజల్లో సంతృప్తి

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



ఎమ్మెల్యే వెలగపూడి, ఆయన తనయుడు ప్రతాపరుద్ర, కార్పొరేటర్‌శ్రీవిద్యకు కొండవాలు ప్రాంత వాసుల నీరాజనాలు

వెంకోజీపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న అభివృద్ధి, సంక్షేమం విధానంపై ప్రజల మంచి ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం 15వ వార్డులోని సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో వార్డు టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్‌ల ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామన్నారు. ఎవరికైనా ఎటువంటి సహాయం కావాలన్నా తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, తనను కలిసి సమస్యను విన్నవించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా కొండ ప్రాంతవాసులు తమకు ఎప్పటి నుంచో ప్రధాన మార్గంలో యూజీడీ సమస్య అధికంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత ప్రతాపరుద్ర, టీడీపీ సీనియర్ నాయకులు బోర ధనరెడ్డి, అప్పారి గిరిబాబు, సిహెచ్. గోవింద్, కె.మహేష్, కర్రి గౌరీ, వరలక్ష్మి, సన్యాసమ్మ, సోమేశ్వరి, ఇతర నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

బెంచీలు లేని బస్సు షెల్టర్



లాసన్స్ బే కాలనీలో బెంచీలు లేని బస్సు షెల్టర్

పెదవాల్తేరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలో బెంచీలు లేని బస్సు షెల్టర్లు దర్శనమిస్తున్నాయి. లాసన్స్ బే కాలనీ బస్సు షెల్టర్‌లో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు అసలు కూర్చోవడానికి వీలు లేని పరిస్థితి ఉంది. ఈ షెల్టర్‌లో బెంచీలు లేవు. కేవలం నీడ ఇచ్చేందుకు షెల్టర్ మాత్రమే ఉంది. దీనికి సమీపంలో బధిరుల పాఠశాల ఉంది. అందుకోసమే ఇక్కడ బస్సు షెల్టర్ ఏర్పాటు చేశారు. అయితే కుర్చీలు, బెంచీ వంటి సదుపాయం లేకపోవడంతో ఆ విద్యార్థులు కూర్చునేందుకు కూడా అవకాశం లేకుండా పోతోంది. కొన్నిసార్లు విద్యార్థులు గంటల తరబడి బస్సుల కోసం వేచి అలాగే నిల్చొని వేచి ఉంటారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండా కాలంలో చాలా ఇబ్బందిగా ఉంటుందని అంటున్నారు. జీవీఎంసీ, ఆర్టీసీ అధికారులు స్పందించి ఈ బస్సు షెల్టర్‌లో కూర్చునేందుకు సదుపాయం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నత పాఠశాల విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జాతీయ అంధత్వ నివారణ దినోత్సవంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఒకటో తరగతి నుంచి పదో తరగతి చదవుతున్న విద్యార్థులకు ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు జిల్లాలో ఈ నెల 21 నుంచి కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గ్రేటర్ విశాఖ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో గురువారం సుమారు 430 మంది విద్యార్థులకు పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఆర్.సురేష్ నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 64 మందికి దృష్టి దోషఉన్నట్టు నిర్ధారించారు. కళ్ళద్దాలు 58 మందికి అవసరమని, వీరికి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కళ్ళద్దాలు పంపిణీ చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి, పాఠశాల భవిత కేంద్రం టీచర్లు జగదాంబ, శారద పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అంతర్గత నైపుణ్యాలను వెలికితీయాలి

కంచరపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులలో అంతర్గతంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలుగులోకి తీసుకొచ్చి వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్‌చంద్రశేఖర్ అన్నారు. బర్మా కాలనీ మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏపీసీ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల పఠనా నైపుణ్యాలను పరిశీలించారు. ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాలల్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై ఆరా తీశారు. త్వరలో పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో చదువు పట్ల ఏకాగ్రత, పట్టుదల కలిగేటట్టు ఉపాధ్యాయులు ఆకర్షణీయ బోధనను అందించాలన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.వసంతకుమారి, ఉపాధ్యాయులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నక్కవానిపాలెంలో అంధకారం

» మరమ్మతుల పేరుతో వీధి దీపాలు తొలగించి మళ్లీ అమర్చని ఫలితం



స్తంభానికి తొలగించిన విద్యుత్ దీపాలు

సీతమ్మధార, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో విద్యుత్ దీపాలు వెలగక అంధకారం రాజ్యమేలుతోంది. ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నక్కవానిపాలెం ప్రవేశానికి ముందు నాలుగు విద్యుత్ దీపాలతో ఉండే స్తంభం నుంచి కొద్ది రోజుల క్రితం మరమ్మతుల నిమిత్తం దీపాలను తొలగించారు. మళ్లీ వాటిని అమర్చకపోవడంతో ఆ ప్రాంతం చీకటిగా ఉంటోంది. ఆ స్తంభానికి ఉండే నాలుగు విద్యుత్ దీపాలు వెలగకపోగా, వేలాడుతూ ఉండేవి. 'వేలాడుతున్న విద్యుత్ దీపాలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో మరమ్మతు చేయడానికి ఆ శాఖ సిబ్బంది వచ్చి దీపాలను కిందికి దించారు. వాటిని అమర్చకుండా విద్యుత్ స్తంభాన్ని అలంకారప్రాయంగా వదిలేశారు. ఆ స్తంభం వద్ద చీకటిగా ఉండటంతో మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. నక్కవానిపాలెంలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ దీపాలు వెలగడం లేదు. రాత్రి పూట కుక్కల బెడద పెరిగింది. వాహనదారులను కుక్కలు వెంటాడుతున్నాయి. దీంతో ప్రజలు భయభ్రాంతులు చెందుతున్నారు. వీధి దీపాలు వెలిగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రాత్రి వేళ అలుముకున్న చీకట్లు

నాణ్యమైన కూరగాయలనే విక్రయించాలి

» రైతుబజార్‌లో మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస్‌కిరణ్ తనిఖీలు



రైతు కార్డు పరిశీలిస్తున్న డీడీ శ్రీనివాస్‌కిరణ్

అక్కయ్యపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజార్‌ను వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస్‌కిరణ్ గురువారం తనిఖీ చేశారు. బజార్‌లోని డ్వాక్రా, రైతుల స్టాళ్లు పరిశీలించి వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు విక్రయించాలని సూచించారు. పాడైపోయినవి విక్రయిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి రోజూ అన్ని స్టాళ్లు పరిశీలించి నాణ్యమైన కూరగాయలు తీసుకొస్తున్నారో లేదో తనిఖీ చేయాలని ఎస్టేట్ అధికారిని ఆదేశించారు. కొంతమంది డ్వాక్రా స్టాళ్ల కాలపరిమితి గురువారంతో ముగియడంతో కొత్త డ్వాక్రా గ్రూపుల వ్యాపారులు ఎప్పుడు వస్తారని ఎస్టేట్ అధికారి కొండబాబును అడిగారు. కొత్త వారు కొద్ది రోజుల తర్వాత వస్తారని సమాధానమివ్వడంతో అలా కుదరదని, అందుకోసం వెంటనే వారికి కబురు పంపి శుక్రవారం వచ్చి స్టాళ్లు తెరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీడీతో పాటు ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సత్యనారాయణ ఉన్నారు.

సామూహిక సీమంతాలు



గర్భిణులకు పండ్లు అందజేస్తున్న కార్పొరేటర్ శ్రావణి, రోటరీ క్లబ్ ప్రతినిధులు

అక్కయ్యపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ సురభి సంస్థ ఆధ్వర్యంలో గ్రేటర్ 26వ వార్డు చిన్నూరు మసీదు సమీపం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు పండ్లు, ప్రొటీన్ పౌడర్, బేబీ టవల్స్ పంపిణీ చేశారు. అలాగే గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, జాగ్రత్తల పాటు కొన్ని వ్యాయామాలు రోటేరియన్లు డాక్టర్ అనూష, గైనకాలజిస్ట్, డాక్టర్ సంతోష్ బాలాజీ వివరించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, రోటరీ క్లబ్ సౌత్ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, క్లబ్ సురభి అధ్యక్షురాలు టి.సత్యశ్రీ, లక్ష్మీదేవి, హర్ష, పిల్లి రమణి, మహేష్, సిద్దు, రాజేష్, సునీత పాల్గొన్నారు.

సోనియాగాంధీ నగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు



ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, టీడీపీ నేతలు

అక్కయ్యపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 45వ వార్డు సోనియా గాంధీ నగర్, శివశంకర రజక కాలనీలో టీడీపీ వార్డు కమిటీ ఆధ్వర్యంలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమెల్సీ దువ్వారపు రామారావు ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ పథకాలతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో నాయకులు పైలా ముత్యాలనాయుడు, వాసుపల్లి రాజు, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జూలై 31 (ఆంధ్ర జ్యోతి) : నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. మహారాణి పార్లర్, శంకువానిపాలెం, మసీదు, ఎనభై అడుగుల రోడ్డు, మున్సిపల్ స్కూల్, నందగిరినగర్, చాకలిపేట, చెక్కుడురాయి బిల్డింగ్, హరగోపాల్ స్కూల్, రైల్వే న్యూ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రహ్లాద వరదునికి పసిడి కుసుమార్చన



పూజలందుకున్న స్వామివారు

సింహాచలం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : వరాహనారసింహునికి ఆర్జిత సేవల్లో భాగంగా పసిడి కుసుమార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. పద్మనిధి నుంచి పసిడి కుసుమాలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పం చి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతినామానికి పసిడి కుసుమాలతో అర్చనలు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

నామరూపాల్లేని బస్‌బేలు

... 5వ పేజీ తరువాయి

బస్‌బేలు నిర్మాణం, ప్రయాణికులు కూర్చొనేందుకు బెంచీలు, ఫ్యాన్‌లు, తాగునీరు సదుపాయంతోపాటు ఆ ప్రాంతం పేరు తెలిసేలా ఎల్‌ఈడీ నేమ్‌ప్లేట్‌లు ఏర్పాటు చేశారు. పగటిపూటే కాకుండా రాత్రివేళల్లో కూడా చూసేవారిని ఆకట్టుకునేలా బస్‌బేలను అభివృద్ధి చేశారు. అయితే వీటిని నిర్వహించడంలో జీవీఎంసీ, ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో రాత్రివేళ ఆకతాయిలు వాటిల్లో చేరి ఫ్యాన్లు, లైట్లను తీసుకువెళ్లిపోవడం, ఎలివేషన్ బోర్డులను పీకేయడం చేస్తున్నారు. అదేవిధంగా నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో కొన్నిచోట్ల షీట్లు ఊడి వేలాడుతున్నాయి. దీంతో ప్రయాణికులు వాటిల్లో కూర్చొనేందుకు కూడా అవకాశం ఉండడం లేదు. ఇంతవరకు స్మార్ట్ లుక్‌తో అందరినీ కట్టిపడేసిన బస్‌బేలు ఇప్పుడు అందవిహీనంగా దర్శనమిస్తున్నాయి. రూ.కోట్లు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన బస్‌బేలు రెండేళ్లు తిరిగేసరికి మూలకు చేరిపోవడంపై నగరవాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఏదైనా అభివృద్ధి చేసినప్పుడు దానిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత తీసుకోవాలన్న విషయాన్ని జీవీఎంసీ, ఆర్టీసీ శాఖలు విస్మరించడం దారుణమని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా బస్టాప్‌ల నిర్వహణపై దృష్టిసారించాలని డిమాండ్ చేస్తున్నారు.

నేటి నుంచి ఆటోమ్యుటేషన్

... 5వ పేజీ తరువాయి

బకాయిలు కట్టాలని నోటీసులు ఏమీ రావు. దీంతో పాటు కొళాయి కనెక్షన్ పేరు కూడా రికార్డుల్లో మారుతుంది. దశల వారీగా విద్యుత్ మీటరు పేరు కూడా మార్చడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతానికి జీవీఎంసీ, రిజిస్ట్రేషన్ల శాఖ రికార్డులను లింక్ చేశారు. త్వరలో సంబంధిత విభాగాలతోను అనుసంధానం చేయనున్నారు.

రెస్టో బార్ల నిర్మాణం అక్రమం

... 5వ పేజీ తరువాయి

తమకు తెలియదని బుకాయించారు. విరాగో రెస్టో బార్ నిర్వాహకులు తాము కేవలం లీజుదారులమేనని పేర్కొన్నారు. అయితే ఆ భూమికి సంబంధించిన డాక్యుమెంట్, ఈసీ కాపీ, 30అడుగుల మాస్టర్‌ప్లాన్ రహదారి, భవనం డ్రాయింగ్ అన్నీ సమర్పించాలని జీవీఎంసీ అధికారులు ఆదేశించారు. ఈ వివరణలన్నీ హైకోర్టుకు సమర్పించి, అక్కడ నుంచి వచ్చే ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. హైకోర్టులో కమిటీ నివేదిక కూడా ఉన్నందున చర్యలకు సిఫారసు చేసే అవకాశం ఉందని మూర్తియాదవ్ పేర్కొన్నారు.

ప్రో కబడ్డీకి వేదికగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

యుపీ యోధా...మొత్తం 12 జట్లు తలపడనున్నాయి.

దాదాపు ఏడేళ్ల తర్వాత

2014లో ఇండియన్ ప్రొఫెషనల్ కబడ్డీ లీగ్ తొలి సీజన్ టోర్నీ విశాఖ నుంచే ప్రారంభం కావడం విశేషం. తెలుగు టైటాన్స్ హోమ్ టీమ్‌గా ఆగస్టు 16 నుంచి 19 వరకూ జరిగిన ఏడు మ్యాచ్‌లకు పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం వేదికైంది. ఆ తర్వాత పీకేఎల్ సీజన్-3 టోర్నీకి సంబంధించి 2016లో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 2 వరకూమరో ఏడు మ్యాచ్‌లు జరిగాయి. చివరిగా పీకేఎల్ సీజన్-6కు సంబంధించి 2018లో డిసెంబరు 7 నుంచి 13 వరకూ జరిగిన 11 మ్యాచ్‌లకు పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా నిలిచింది. ఆ తర్వాత జరిగిన సీజన్లకు తెలుగు టైటాన్స్ యాజమాన్యం హోమ్ గ్రౌండ్‌గా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియాన్ని వేదిక చేసుకున్నది. దాదాపు ఏడేళ్ల తర్వాత ఈ ఏడాది ఆగస్టు 29 నుంచి జరగనున్న పీకేఎల్ సీజన్-12 టోర్నీకి విశాఖ ఆతిథ్యమివ్వనుంది.

సైబర్ ముఠాల చేతిలో తెలుగు యువకులు

... 5వ పేజీ తరువాయి

తీసుకుని వాహనాలు ఎక్కించారు. వారి కళ్లకు గంతలు కట్టి సుమారు 15 వాహనాలు మార్చి, ఒకటిన్నర రోజులు వాహనాల్లోనే వేర్వేరు ప్రాంతాలు తిప్పారు. చివరకు ఆనవాళ్లు కూడా తెలియని ఒకచోట గదిలో ఉంచారు. ఎక్కడకు తీసుకువచ్చారని ముఠా సభ్యులను ఇద్దరు యువకులు ప్రశ్నించగా చైనా జాతీయుల మాదిరిగా ఉన్న కొందరువచ్చి వారిని కొట్టడంతో అందరూ భయభ్రాంతులకు గురయ్యారు. అందరూ ఆడవారి గొంతుతో ఫోన్‌లో మాట్లాడి సైబర్‌స్కామ్ చేయాలని ఆదేశించారు. తమకు అంతగా ఇంగ్లీష్‌రాదని, చాటింగ్ కూడా సరిగా చేయలేమని ఒక యువకుడు చెప్పగా, అతడిని గదిలోకి తీసుకువెళ్లి ఇనుప హాకీ స్టిక్‌తో రక్తం వచ్చేలా కొట్టారు. దీంతో అందరూ భయపడి సైబర్‌స్కామ్ చేయడం ప్రారంభించారు. రోజుకు మొదట 16 గంటలు, తర్వాత 18 గంటలు, తర్వాత 20 గంటలు పనిచేయాలని చెప్పడంతో వారం గడిచేసరికి తాము చేయలేమని చేతులెత్తేయగా కొట్టడంతోపాటు దుస్తులు విప్పించి చిత్రహింసలకు గురిచేశారు. తాము ఇంకా వారి వేధింపులను తట్టుకోలేమని, ఫోన్ చేయడానికి కూడా అవకాశం లేకుండా ఒకరు కాపలా ఉంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తాము ఉంటున్న లొకేషన్‌ను పంపిస్తామని, ఆ ముఠా చేతుల్లోనుంచి తమను రక్షించి ఇండియా వచ్చేలా చేయాలని పవన్‌కల్యాణ్‌ను వేడుకున్నారు. ఇంతలో ఎవరో వస్తున్నట్టు చప్పుడు కావడంతో వీడియోను ఆపేశారు. అయితే వీడియోలో మాట్లాడిన వారి పూర్తి వివరాలు మాత్రం తెలియలేదు. దీనిపై ఇప్పటికే నగర పోలీసులు దృష్టిసారించి వారిని గుర్తించే ప్రయత్నాలు ప్రారంభించినట్టు తెలిసింది.

భూమాయ

... 5వ పేజీ తరువాయి

ఇస్తారు. దీనికి అనుగుణంగా ఆనందపురం రెవెన్యూ అధికారులు ఐదు ఎకరాలు విడిచిపెట్టి మిగిలిన 1.35 ఎకరాలు స్వాధీనం చేసుకున్నారు. అయితే సదరు వ్యక్తులు 6.35 ఎకరాలకు క్లెయిమ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో వైసీపీ నేతల హస్తం ఉందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై గ్రామానికి చెందిన ఒకరు..ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భూసమీకరణకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ద్వారకా బస్‌స్టేషన్‌లో కలెక్టర్ తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

కాంప్లెక్స్‌లోని స్టాళ్లను పరిశీలించి అన్ని రకాల ఐటమ్స్ ఎంఆర్‌పీకి అమ్ముతున్నారా లేదా అని ఆరా తీశారు. కాంప్లెక్సు నిర్వాహణపై కలెక్టర్ సంతృప్తిని వ్యక్తంచేశారు. బస్సుల్లో కిటికీ కర్టెన్స్‌ను తరచూ మారుస్తూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.పద్మావతి, సెక్యూరిటీ ఆఫీసర్ ఐవీవీపీ దుర్గాప్రసాద్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ నాయుడు, పలువురు అధికారులు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

సింహగిరిపై పెళ్లిళ్లకు రూ.10 వేలు చార్జి

... 5వ పేజీ తరువాయి

అధికారులు సమ్మతించిన స్థలాల్లో వివాహాలకు అనుమతిస్తారు. వివాహం తరువాత మూడు గంటలలోపు అందుకు వాడిన కుర్చీలు, మండపాలు, సోఫాలు, తదితరాలను అక్కడ నుంచి ఖాళీ చేయాలి. వివాహం చేసుకోదలచిన వారి నుంచి పారిశుధ్యం నిమిత్తం రూ.2 వేలు, అడ్వాన్స్ రూపంలో రూ.5 వేలు వసూలు చేసి పెళ్లి అనంతరం తిరిగి ఇచ్చే విధంగా పీఆర్‌ఓ కార్యాలయంలో సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని ఈఓ ఆదేశించారు.

'వైసీపీ నేత క్షమాపణ చెప్పాలి'



దీక్షకు మద్దతు తెలుపుతున్న కూటమి నాయకులు

జ్ఞానాపురం జూలై 31(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 41వార్డులో నిర్వహించిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకుడు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల శ్రీధర్ స్థానిక ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో జనసేన కార్యకర్తలు ఆగ్రహించి గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ నేత క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షకు వార్డులోని కూటమి నాయకులు మద్దతు పలికారు.

ఎక్కడ చూసినా చెత్త కుప్పలే!



రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

మురళీనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 49వ వార్డు నివాసిత ప్రాంతాల్లో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బర్మాక్యాంప్, ఎల్‌బీనగర్, మాణిక్యాంబ కాలనీ గెడ్డ సమీప నివాసినత ప్రాంతాల్లో చెత్త బాగా పేరుకుపోయింది. దీనిపై సచివాలయ సిబ్బంది, వార్డు శానిటరీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

జ్ఞానాపురం జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ప్రముఖ పాఠశాల సమీపంలో గురువారం గుర్తుతెలయని వ్యక్తి మరణించడంతో 41వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మధుబాబు, రవిబాబు ఆర్థిక సహాయం చేసి 'అవర్‌హ్యాండ్' స్వచ్ఛంద సంస్థకు మృతదేహాన్ని అప్పగించారు. ఈ సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో కాన్వెంట్ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి.

తాగునీటి పైప్‌లైన్లలో డ్రైనేజీ నీరు

» సమస్య పరిష్కరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతి



జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న కార్పొరేటర్

మహారాణిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్లు లీకవుతూ పక్కనే ఉన్న మంచినీటి పైప్‌లైన్లలో కలిసిపోయి తాగునీరు కలుషితం అవుతోందని 38వ వార్డు కార్పొరేటర్ విజయలక్ష్మి నరసింహాచారి అన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, మేయర్ పీలా శ్రీనివాసరావుకు గురువారం వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత నీరు తాగడం వల్ల ప్రజలు రోగాలా పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలలుగా జీవీఎంసీ యూజీడీ విభాగంలో డీఈ, ఏఈ అధికారులకు ప్రజల సమస్యల గురించి వివరించినా ఫలితం ఉండడం లేదని అన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని నరసింహాచారి కోరారు.

అలాగే ఫిషింగ్ హార్బర్, బీచ్‌రోడ్డు, పోర్టు రోడ్డుకు ఆనుకుని ఉన్న సీసీ రోడ్లలో అండర్ గ్రౌండ్ కేబుల్ పనుల కోసం రోడ్డును తవ్వి డబ్రిస్ వదిలేశారని, దీని వల్ల రహదారులు అస్తవ్యస్తంగా మారాయని వినతి పత్రాల్లో పేర్కొన్నారు.

కుంచించుకుపోతున్న గెడ్డలు



ఆక్రమణకు గురైన రెడ్డికంచరపాలెం గెడ్డ

కంచరపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 54, 55 వార్డుల పరిధిలో పలువురి ఆక్రమణ కారణంగా ప్రధాన గెడ్డలు కుచించుకుపోతున్నాయి. ధర్మానగర్, అశోక్‌నగర్, రెడ్డికంచరపాలెం, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, బాపూజీనగర్ తదితర ప్రాంతాల్లోని ప్రధాన గెడ్డలు ఆక్రమణకు గురయ్యాయి. గెడ్డలకు ఇరువైపులా ఉండే గృహాలు క్రమేపీ ముందుకు జరుగుతుండడంతో అవి కాలువల మాదిరి కుచించుకుపోతున్నాయి. ఇలా ఇష్టమొచ్చినట్టు ఆక్రమించేడ యం వల్ల కొత్తవాడ వీధి, సాయిబాబా గుడి వద్ద, వివేకానంద వీధిలో ఉన్న గెడ్డల్లో నీరు ప్రవహించేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో పాటు గెడ్డలకు రక్షణ గోడల నిర్మాణం జరగకపోవడంతో పురుగులు, పాములు సమీపంలో గల గృహాల్లోకి చేరుతున్నాయి. ఇప్పటికైనా కార్పొరేటర్లు దృష్టి సారించి గెడ్డల వద్ద రక్షణ గోడల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. రానున్నది వర్షాకాలం.. గెడ్డలలో మురుగు సజావుగా ప్రవహించడానికి పూడికలు తొలగించడంతోపాటు రిటర్నింగ్ వాల్స్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎం చంద్రబాబు మైనారిటీల పక్షపాతి

ఏపీ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ మస్తాక్ అహ్మద్



సభలో మాట్లాడుతన్న షేక్ మస్తాక్

మహారాణిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రిస్టియన్లు, ముస్లింల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఏపీ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ మస్తాక్ అహ్మద్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ముస్లిం, క్రిస్టియన్ నాయకులతో ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీ కార్పొరేషన్ ద్వారా లోన్లు ఇప్పించి చేయూత ఇస్తున్న ఘనత కూటమికే దక్కుతుందని అన్నారు. ఈ లోన్లను మైనారిటీకి చెందిన వారు సద్వినియోగం చేసుకోవాని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ చిన రెహమాన్ మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ



ఫుట్‌పాత్ ఆక్రమణ కారణంగా స్తంభించిన ట్రాఫిక్

మద్రిపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే మద్రిపాలెం ఏరియాలో ఫుట్‌పాత్‌లను, రోడ్డును చిరువర్తకులు ఆక్రమించేస్తున్నారు. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిరువర్తకులు రోడ్డుకు ఆనుకుని వ్యాపారం చేసుకుంటూ వారికి సంబంధించిన వస్తువులను ఫుట్‌పాత్‌లపై పెట్టి ఆక్రమిస్తున్నారు. తోపుడుబండ్ల మీద వ్యాపారం చేసుకునే వాళ్లు కూడా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వారి వ్యాపారాలు సాగిస్తున్నారు. నడవడానికి కూడా చోటు లేక పాదచారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్య మరింత ఉంటుంది ఆ సమయాల్లో రోడ్ల మీదకు రావాలంటేనే భయంగా ఉన్నదని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రహదారులపై భవన నిర్మాణ సామగ్రి

మురళీనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో జోరుగా సాగుతున్న నిర్మాణాలతో రోడ్ల నిండా వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. భవన నిర్మాణ సామగ్రి రోడ్డుమీదే పోసేస్తున్నారు. నిర్మాణానికి ముందే రోడ్డుని ఆక్రమించి టెంట్లు, తాత్కాలిక గుడారాలు వేసి ఆక్రమిస్తున్నారు. వాచ్‌మ్యాన్ నివాసాలు, మెటీరియల్ డంప్ చేసి రోడ్డుని సొంత స్థలంగా వాడేస్తున్నారు. ఇంతక ముందు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, జోన్-5 జడ్సీ పర్యటనల్లో ప్రత్యక్షంగా పరిశీలించి నిర్మాణ సామగ్రి వేసిన వారిపై కేసులు నమోదు చేసి నగర శుభ్రతకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు మారినప్పుడల్లా వార్డుల్లో రాకపోకలకు వీలు లేకుండా రోడ్లమీద ఇసుక పోస్తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డుపైనే వేసిన భవన నిర్మాణ సామగ్రి

కాలువకు మరమ్మతు మాటే మరిచారు!

- నెలల తరబడి పూడికతీత ఊసే లేదు
- రక్షణ గోడల నిర్మాణం గురించి పట్టించుకునే వారే లేరు
- దోమలు, దుర్గంధంతో శ్రీకాంత్‌నగర్ వాసుల విలవిల


పూడిక తీత చేపట్టక, రిటైనింగ్ వాల్స్ లేకపోవడంతో అధ్వానంగా ఉన్న ప్రధాన కాలువ

ఆరిలోవ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులోని శ్రీకాంత్‌నగర్ 4వ లైన్‌లో గల ప్రధాన కాలువలో పూడిక దట్టంగా పేరుకుపోయి ఉంది. దీంతో దోమల విపరీతంగా విజృంభిస్తున్నాయి. నెలల తరబడి పూడిక తొలగింపు చేపట్టకపోవడంతో చెత్తాచెదారం కుళ్లిపోయి పరిసరాలు దుర్గంధంతో నిండిపోయాయి. ఇటువైపు వెళ్లాలంటేనే ముక్కు మూసుకుని వెళాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు విపరీతంగా ఉండడం వల్ల ఎప్పుడు ఏ రోగాలు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు.

ఈ కాలువకు మరమ్మతులు చేపట్టి సుమారు 15 ఏళ్లు అవుతున్నాయని స్థానికులు తెలిపారు. ఎలాంటి మరమ్మతులు చేపట్టకుండా, కనీసం పూడికలు తీయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారని, దీనివల్ల తాము ఇబ్బందులకు గురవుతున్నామని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు వినతులు సమర్పించినా పూడిక తీసేందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తెండి, వెంటనే పరిష్కరిస్తామంటూ ప్రజాప్రతినిధులు చెప్పడమే గాని, ఆచరణలో మాత్రం కనిపించడం లేదని విమర్శిస్తున్నారు.

ఈ ప్రధాన కాలువకు రక్షణ గోడలు నిర్మించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రధాన గెడ్డ ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నూతన విభాగాధిపతుల నియామకం


ఏయూ వీసీ రాజశేఖర్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకుంటున్న ప్రొఫెసర్లు ప్రేమానందం, సత్యనారాయణ, సింహాచలం

వెంకోజీపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఏయూ జర్నలిజం మాస్ కమ్యూనికేషన్స్, హిందీ, రంగస్థల విభాగాలకు నూతన విభాగాధిపతులు గురువారం నియామకం అయ్యారు. జర్నలిజం మాస్ కమ్యూనికేషన్స్ విభాగాధిపతిగా పి.ప్రేమానందం, హిందీ విభాగాధిపతిగా ఎన్.సత్యనారాయణ, థియేటర్ ఆర్ట్స్ విభాగాధిపతిగా డి.సింహాచలంను నియమిస్తూ ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా నూతన విభాగాధిపతులకు ఏయూ వీసీ, పలువురు ప్రొఫెసర్లు శుభాకాంక్షలు తెలియజేశారు.

రైతుబజార్‌ను సందర్శించిన మార్కెటింగ్ శాఖ డైరెక్టర్లు


ఎంవీపీ రైతు బజార్ సందర్శించి సూచనలిస్తున్న మార్కెటింగ్ శాఖ డైరెక్టర్లు శోభ, తాతారావు

ఎంవీపీ కాలనీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ రైతు బజార్‌ను మార్కెటింగ్ శాఖ డైరెక్టర్లు శోభ, తాతారావు గురువారం సందర్శించారు. ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. బజార్‌లో సౌకర్యాలు, సమస్యలపై ఆరా తీశారు. కొనుగోలుదారులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాల్సిన బాధ్యత రైతు బజార్ అధికారులతో పాటు రైతులపై కూడా ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు రైతు బజార్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. ఎస్టేట్ అధికారి కె.వరహాలు, సహాయ అధికారి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పాల్గొన్న కార్పొరేటర్ అప్పలకొండ, టీడీపీ నేతలు

రామ్‌నగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 28వ వార్డులో ఫేకర్ లే అవుట్ వద్ద సుమారు రూ.60 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కొనసాగుతుందన్నారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ గత వారం రోజులుగా ఈ వార్డులో రూ.కోటి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినట్టు తెలిపారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, టీడీపీ వార్డు అధ్యక్షుడు నక్కా కనకరాజు, వైసీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, వార్డు నాయకులు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు

వసతిగృహాలను సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి


విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

ఆరిలోవ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బాలికలకు అత్యవసర సమయాల్లో తక్షణమే వైద్య సహాయం అందేలా చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయడు పేర్కొన్నారు. ఆయన గురవారం విశాఖ వేలి స్కూలు సమీపంలో గల ప్రభుత్వ బాలికల (సదనం) గృహాన్ని సందర్శించారు. బాలికలకు కల్పిస్తున్నసౌకర్యాల గురించి ఆయన ఆరా తీశారు. వారికి అందిస్తున్న ఆహారం, పరిశుభ్రత, వైద్యసేవలు, విద్యా సౌకర్యాల, భద్రత, తదితర అంశాలను ఆయన పరిశీలించారు. హాస్టల్ నిర్వాహణకు సంబంధించి పలు సూచనలు అందించారు. బాలికలకు పౌష్టికాహారం అందించాలని పరిశుభ్ర వాతావరణం ఉండే విధంగా చూడాలని ఆయన సూపరింటెండెంట్ నయోమిని ఆదేశించారు.

అనంతరం ఆయన చినగదిలి మండల తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో గల సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. అక్కడ విద్యార్థులకు కల్పిస్తున్న వసతి, ఆహారం, పారిశుధ్యం, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. వార్డెన్‌తో మాట్లాడి విద్యార్థుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యల గురించి అడిగారు. ఏవైనా లోపాలు ఉంటే వాటిని వెంటనే సరిదిద్దాలని సూచించారు.

ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసిన అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘు నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు గురువారం లేఖ రాశారు. ప్లాంటులో ఉపాధి కోసం నిర్వాసితులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని,ఈ క్రమంలో కాంట్రాక్టు పనులు చేస్తున్న నిర్వాసితులను కూడా విధుల నుంచి తొలగిస్తున్నారని పేర్కొన్నారు.

ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను ఉక్కు యాజమాన్యం తొలగిస్తుండడంతో ఎంతోమంది కుటుంబాలతో రోడ్డున పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. అలాగే త్వరలో సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లను కలిసి సమస్యను విన్నవిస్తామని వారు పేర్కొన్నారు.

కమిషనర్ సారూ.. ఇదేనా స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర?

- పిఠాపురం కాలనీలో అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- బజార్ ఎదురుగా డ్రైనేజీలో ఏడు వారాలుగా పేరుకుపోయిన చెత్త
- దుర్గంధం, దోమలతో స్థానికుల సతమతం
- వ్యాధుల బారిన పడుతున్నామంటూ గగ్గోలు


పిఠాపురం కాలనీ బజార్ ఎదురుగా డ్రైనేజీలో నిలిచిపోయిన మురుగు, చెత్తాచెదారం

మద్దిలపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : 'విశాఖను పరిశుభ్రంగా ఉంచి దేశంలోనే నంబర్ 1గా తీర్చిదిద్దుతామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానం సాధనకు కృషి చేయాలని పిలుపు ఇస్తుంటారు. నగరం నడి బొడ్డులో మురికికూపల గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. ఇదేనా కమిషనర్ సారూ పరిశుభ్రతపై తీసుకుంటున్న చర్యలు! ఇలానేనా సర్వేక్షణ్‌లో నగరం ప్రథమం కాదు అధమ స్థానంలో ఉంటుంది' అంటూ 22వ వార్డు పిఠాపురం కాలనీ వాసులు గగ్గోలు పెడుతున్నారు.

పిఠాపురం కాలనీ బజార్ ఎదురుగా డ్రైనేజీలో ఏడు వారాల నుంచి మురుగు నిల్వ ఉంటోంది. నిల్వ ఉన్న మురుగు కూపంలా మారి దుర్వాసన వస్తుండడంతో అటుగా రాకపోకలు సాగించే వారు ముక్కులు మూసుకొని వెళ్లాల్సి వస్తోంది. దీనిపై చర్యలు తీసుకునే దాఖలాలే కనిపించడం లేదు. ఇంతవరకూ మురుగును పారిశుధ్య సిబ్బంది తొలగించలేదు. అధికారులు మాత్రం పరిశుభ్రతపై కార్యక్రమాలు చేపడతారు. స్వచ్ఛభారత్ అంటారు. స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర అంటూ ప్రతిజ్ఞలు చేసి ఊదరగొడుతుంటారు. ఏమంటే మన పరిసరాలు మనం శుభ్రంగా పెట్టుకోవాలని కాకమ్మ కథలు చెబుతారు.

కానీ కళ్ల ముందే కనిపిస్తున్న మురుగుపట్టిన కాలువ వీరి కంటికి కనిపించడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలంటారు. అందుకోసం రోజూ ప్రత్యేకంగా ప్రచారం. నగరం నడిబొడ్డులో ఉన్న కాలువలో టన్నుల్లో పేరుకు పోయిన మురుగు గురించి పట్టించుకోకుండా ఒట్టి వాగ్దానాలు ఎందుకంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మురుగుపై 'రయ్..'మంటూ దోమలు చేసే శబ్దం అధికారులకు వినిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లల్లో పూలకుండీలు, డ్రమ్ములు పరిశీలించి నీరు నిల్వ లేకుండా చూడాలని జాగ్రత్తలు చెబుతున్నారు. అంతవరకే నగరపాలక సంస్థ పారిశుధ్య అధికారులు, సిబ్బంది తీరులా ఉందంటూ ఆక్షేపిస్తున్నారు.

రోగాలకు నిలయం..

పిఠాపురం కాలనీ బజార్ ఎదురుగా మురుగు, వ్యర్థాలు నిండిపోయి దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. దీంతో పగలూ రాత్రి నిద్రపట్టే పరిస్థితి లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం 6 గంటలు దాటితే దోమలు దాడి చేస్తున్నాయని వాపోతున్నారు. దోమ కాటుకు గురై వ్యాధుల బారిన పడుతున్నామని మండిపడుతున్నారు. దుర్గంధం వెదజల్లుతున్నా, దోమలు విజృంభించి ప్రజలు అనారోగ్యం పాలవుతున్న జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది మురుగుకూపం వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తానని తెలిపిన జీవీఎంసీ కమిషనర్ అయినా ఈ మురుగు కూపం నుంచి ప్రజలకు విముక్తి కలిగించాలని అంతా కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన, నారసింహ హోమం


విశేష అలంకరణలో సుదర్శన స్వామి

ఎంవీపీ కాలనీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరు వేంకటేశ్వరస్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో గురువారం సుదర్శన, నారసింహ హోమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సుదర్శన జయంతి సందర్భంగా భారీగా హాజరైన భక్తుల మధ్య ప్రథమారాధన, పంచామృతాభిషేకాలు, విష్వక్సేనారాధన, మండలారాధన, యోగశాల ప్రవేశం, సుదర్శన శతకం, నారసింహ శ్రీలక్ష్మీ పావనం, పూర్ణాహుతితో కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు లక్ష్మణస్వామి, శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజలను ఆలయ కమిటీ కార్యదర్శి ప్రసాదరావు పర్యవేక్షించారు.

కోతిచేష్టలతో ఇబ్బందులు


దీనదయాళ్‌పురంలో హల్‌చల్ చేస్తున్న వానరం

ఆరిలోవ, జూలై31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో ఒక కోతి చాలా ఇబ్బంది పెడుతుందంటూస్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లల్లోకి ప్రవేశించి సామగ్రి చిందరవందర చేయడం, పనుల్లో నిమగ్నమై ఉన్న తరుణంలో మనుషులపైకి దూకి గోళ్లతో రక్కడం, పెరట్లో ఉంటే కూరగాయల పాదులు, అరటి, బొప్పాయి, జామ తదితర పంటలను నాశనం చేస్తోందని చెబుతున్నారు. ఈ కోతి వల్ల ఇప్పటికై పలువురు గాయాల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని బారి నుంచి రక్షించాలని కోరుతున్నారు.

13వ వార్డులో 'తొలి అడుగు'

ఆరిలోవ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. గత 13 నెలలుగా చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమం గురించి టీడీపీ నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ప్రజల నుండి మంచి స్పందన వచ్చిందని కార్పొరేటర్ సునీత అన్నారు. అనంతరం ఆమె వార్డులో జరుగుతున్న అభివృద్ధిపనులను పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 48, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 44, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 32, బీరకాయలు 48, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 48,దొండకాయలు 42, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 66, బరబాటి 46, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 38, చిలగడదుంపలు 44, కంద 42, దేముడుచిక్కుడు 98, గోరుచిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	460
విజయనగరం	464
శ్రీకాకుళం	464

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	83
లైవ్ ధర	103
విత్ స్కిన్	176
స్కిన్‌లెస్	186

సకాలంలో అభివృద్ధి పనులు

- ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్, పాల్గొన్న అధికారులు

వెంకోజీపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నిర్ణీత సమయంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ విభాగాధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ఒప్పందం ప్రకారం జీవీఎంసీ అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలోనే పూర్తి చేయాలని ఆదేశించారు. విశాఖ నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్లు కూడా భాగస్వాములేనని, ప్రతి కాంట్రాక్టర్ వారికి ఇచ్చిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. టెండర్ కాల్ ఫర్ చేసినప్పటి నుంచి పనులు పూర్తయ్యే వరకు పనులలో ఎటువంటి జాప్యం ఉండరాదని స్పష్టం చేశారు. ప్రతి పని రూల్ బుక్ ప్రకారం పూర్తయ్యేలా ప్రతి రోజూ పనులను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయం పరిధిలో రెండు లేదా మూడు వర్కులు ఉంటాయని వాటిని పరిశీలించే బాధ్యత వార్డు ఎమినిటీ కార్యదర్శులను భాగస్వామ్యం చేస్తూ ప్రతి రోజూ ఆయా పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. పనులు నిర్ణయించక ముందే ఆ పనిలో ఆటంకాలను గుర్తించి అన్నీ సరిపోయిన పిదప టెండర్లు పిలవాలన్నారు. పనుల్లో సమస్యలు ఉంటే జోనల్ కమిషనర్, ఆపై అధికారులకు తెలియపరిచాలన్నారు. పనుల ఆలస్యంపై కార్యనిర్వాహక ఇంజనీర్లు ఆరా తీయాలన్నార. ఇకపై పనులు సకాలంలో పూర్తి అవకపోవడానికి వేరే సాకులను చెప్పరాదని హెచ్చరించారు. ముఖ్యంగా పనులు చేసేటప్పుడే క్వాలిటీ కంట్రోల్ ప్రతినిధులు ఆ పనుల నాణ్యతలో ఎటువంటి రాజీ లేకుండా పని చేయడంతో పాటు ఆ పని మొత్తం నమోదు చేయాలన్నారు. నాణ్యతలో లోపం వలన ఎన్నో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున కాంట్రాక్టర్ వినియోగించే మెటీరియల్‌లను తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. కాంట్రాక్టర్ పనులు పూర్తి చేసిన వెంటనే వరస క్రమంలో బిల్లులు చెల్లించేందుకు సహకరిస్తామని కమిషనర్ కాంట్రాక్టర్లకు తెలిపారు.

ఈ సందరంగా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు వారి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఎప్పటి నుంచో ఉన్న ఈఎండీలను వెంటనే జారీ చేయాలని, అలాగే పనులు చేసిన పిదప బిల్లుల ప్రక్రియకు వచ్చే సరికి బడ్జెట్ లేదని, ఆ బిల్లును మళ్లీ బిల్లు జనరేట్ అయ్యే వరకు అవుతున్నందు వల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ.. జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మను వాటిని పరిశీలించాలని ఆదేశించారు. సమావేశంలో పర్యవేక్షక ఇంజనీర్లు కేవీఎన్ రవి, పీవీవీ సత్యనారాయరాజు, ఇతర అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఏడాది పాలనపై ప్రజల్లో సంతృప్తి

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు


ఎమ్మెల్యే వెలగపూడి, ఆయన తనయుడు ప్రతాపరుద్ర, కార్పొరేటర్‌శ్రీవిద్యకు కొండవాలు ప్రాంత వాసుల నీరాజనాలు

వెంకోజీపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న అభివృద్ధి, సంక్షేమం విధానంపై ప్రజల మంచి ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం 15వ వార్డులోని సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో వార్డు టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్‌ల ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామన్నారు. ఎవరికైనా ఎటువంటి సహాయం కావాలన్నా తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, తనను కలిసి సమస్యను విన్నవించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా కొండ ప్రాంతవాసులు తమకు ఎప్పటి నుంచో ప్రధాన మార్గంలో యూజీడీ సమస్య అధికంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత ప్రతాపరుద్ర, టీడీపీ సీనియర్ నాయకులు బోర ధనరెడ్డి, అప్పారి గిరిబాబు, సిహెచ్. గోవింద్, కె.మహేష్, కర్రి గౌరీ, వరలక్ష్మి, సన్యాసమ్మ, సోమేశ్వరి, ఇతర నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

బెంచీలు లేని బస్సు షెల్టర్


లాసన్స్ బే కాలనీలో బెంచీలు లేని బస్సు షెల్టర్

పెదవాల్తేరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలో బెంచీలు లేని బస్సు షెల్టర్లు దర్శనమిస్తున్నాయి. లాసన్స్ బే కాలనీ బస్సు షెల్టర్‌లో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు అసలు కూర్చోవడానికి వీలు లేని పరిస్థితి ఉంది. ఈ షెల్టర్‌లో బెంచీలు లేవు. కేవలం నీడ ఇచ్చేందుకు షెల్టర్ మాత్రమే ఉంది. దీనికి సమీపంలో బధిరుల పాఠశాల ఉంది. అందుకోసమే ఇక్కడ బస్సు షెల్టర్ ఏర్పాటు చేశారు. అయితే కుర్చీలు, బెంచీ వంటి సదుపాయం లేకపోవడంతో ఆ విద్యార్థులు కూర్చునేందుకు కూడా అవకాశం లేకుండా పోతోంది. కొన్నిసార్లు విద్యార్థులు గంటల తరబడి బస్సుల కోసం వేచి అలాగే నిల్చొని వేచి ఉంటారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండా కాలంలో చాలా ఇబ్బందిగా ఉంటుందని అంటున్నారు. జీవీఎంసీ, ఆర్టీసీ అధికారులు స్పందించి ఈ బస్సు షెల్టర్‌లో కూర్చునేందుకు సదుపాయం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నత పాఠశాల విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జాతీయ అంధత్వ నివారణ దినోత్సవంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఒకటో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు జిల్లాలో ఈ నెల 21 నుంచి కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గ్రేటర్ విశాఖ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో గురువారం సుమారు 430 మంది విద్యార్థులకు పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఆర్.సురేష్ నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 64 మందికి దృష్టి దోషం ఉన్నట్టు నిర్ధారించారు. కళ్లద్దాలు 58 మందికి అవసరమని, వీరికి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి, పాఠశాల భవిత కేంద్రం టీచర్లు జగదాంబ, శారద పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అంతర్గత నైపుణ్యాలను వెలికితీయాలి

కంచరపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులలో అంతర్గతంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలుగులోకి తీసుకొచ్చి వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్‌చంద్రశేఖర్ అన్నారు. బర్మా కాలనీ మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏపీసీ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల పఠనా నైపుణ్యాలను పరిశీలించారు. ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాలల్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై ఆరా తీశారు. త్వరలో పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో చదువు పట్ల ఏకాగ్రత, పట్టుదల కలిగేటట్టు ఉపాధ్యాయులు ఆకర్షణీయ బోధనను అందించాలన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.వసంతకుమారి, ఉపాధ్యాయులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నక్కవానిపాలెంలో అంధకారం

» మరమ్మతుల పేరుతో వీధి దీపాలు తొలగించి మళ్లీ అమర్చని ఫలితం



స్తంభానికి తొలగించిన విద్యుత్ దీపాలు

సీతమ్మధార, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో విద్యుత్ దీపాలు వెలగక అంధకారం రాజ్యమేలుతోంది. ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నక్కవానిపాలెం ప్రవేశానికి ముందు నాలుగు విద్యుత్ దీపాలతో ఉండే స్తంభం నుంచి కొద్ది రోజుల క్రితం మరమ్మతుల నిమిత్తం దీపాలను తొలగించారు. మళ్లీ వాటిని అమర్చకపోవడంతో ఆ ప్రాంతం చీకటిగా ఉంటోంది. ఆ స్తంభానికి ఉండే నాలుగు విద్యుత్ దీపాలు వెలగకపోగా, వేలాడుతూ ఉండేవి. 'వేలాడుతున్న విద్యుత్ దీపాలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో మరమ్మతు చేయడానికి ఆ శాఖ సిబ్బంది వచ్చి దీపాలను కిందికి దించారు. వాటిని అమర్చకుండా విద్యుత్ స్తంభాన్ని అలంకారప్రాయంగా వదిలేశారు. ఆ స్తంభం వద్ద చీకటిగా ఉండటంతో మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. నక్కవానిపాలెంలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ దీపాలు వెలగడం లేదు. రాత్రి పూట కుక్కల బెడద పెరిగింది. వాహనదారులను కుక్కలు వెంటాడుతున్నాయి. దీంతో ప్రజలు భయభ్రాంతులు చెందుతున్నారు. వీధి దీపాలు వెలిగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రాత్రి వేళ అలుముకున్న చీకట్లు

నాణ్యమైన కూరగాయలనే విక్రయించాలి

» రైతుబజార్‌లో మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస్‌కిరణ్ తనిఖీలు



రైతు కార్డు పరిశీలిస్తున్న డీడీ శ్రీనివాస్‌కిరణ్

అక్కయ్యపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజార్‌ను వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస్‌కిరణ్ గురువారం తనిఖీ చేశారు. బజార్‌లోని డ్వాక్రా, రైతుల స్టాళ్లు పరిశీలించి వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు విక్రయించాలని సూచించారు. పాడైపోయినవి విక్రయిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి రోజూ అన్ని స్టాళ్లు పరిశీలించి నాణ్యమైన కూరగాయలు తీసుకొస్తున్నారో లేదో తనిఖీ చేయాలని ఎస్టేట్ అధికారిని ఆదేశించారు. కొంతమంది డ్వాక్రా స్టాళ్ల కాలపరిమితి గురువారంతో ముగియడంతో కొత్త డ్వాక్రా గ్రూపుల వ్యాపారులు ఎప్పుడు వస్తారని ఎస్టేట్ అధికారి కొండబాబును అడిగారు. కొత్త వారు కొద్ది రోజుల తర్వాత వస్తారని సమాధానమివ్వడంతో అలా కుదరదని, అందుకోసం వెంటనే వారికి కబురు పంపి శుక్రవారం వచ్చి స్టాళ్లు తెరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీడీతో పాటు ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సత్యనారాయణ ఉన్నారు.

సోనియాగాంధీ నగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు



ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, టీడీపీ నేతలు

అక్కయ్యపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 45వ వార్డు సోనియా గాంధీ నగర్, శివశంకర రజక కాలనీలో టీడీపీ వార్డు కమిటీ ఆధ్వర్యంలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో నాయకులు పైలా ముత్యాలనాయుడు, వాసుపల్లి రాజు, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



గర్భిణులకు పండ్లు అందజేస్తున్న కార్పొరేటర్ శ్రావణి, రోటరీ క్లబ్ ప్రతినిధులు

అక్కయ్యపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ సురభి సంస్థ ఆధ్వర్యంలో గ్రేటర్ 26వ వార్డు చిన్నూరు మసీదు సమీపం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు పండ్లు, ప్రొటీన్ పౌడర్, బేబీ టవల్స్ పంపిణీ చేశారు. అలాగే గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, జాగ్రత్తల పాటు కొన్ని వ్యాయామాలు రోటేరియన్లు డాక్టర్ అనూష, గైనకాలజిస్ట్, డాక్టర్ సంతోష్ బాలాజీ వివరించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, రోటరీ క్లబ్ సౌత్ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, క్లబ్ సురభి అధ్యక్షురాలు టి.సత్యశ్రీ, లక్ష్మీదేవి, హర్ష, పిల్లి రమణి, మహేష్, సిద్ధు, రాజేష్, సునీత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జూలై 31 (ఆంధ్ర జ్యోతి) : నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. మహారాణి పార్లర్, శంకువానిపాలెం, మసీదు, ఎనబై అడుగుల రోడ్డు, మున్సిపల్ స్కూల్, నందగిరినగర్, చాకలిపేట, చెక్కుడురాయి బిల్డింగ్, హరగోపాల్ స్కూల్, రైల్వే న్యూ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రహ్లాద వరదునికి పసిడి కుసుమార్చన



పూజలందుకున్న స్వామివారు

సింహాచలం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : వరాహనారసింహునికి ఆర్జిత సేవల్లో భాగంగా పసిడి కుసుమార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. పద్మనిధి నుంచి పసిడి కుసుమాలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతినామానికి పసిడి కుసుమాలతో అర్చనలు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

నామరూపాల్లేని బస్‌బేలు

... 5వ పేజీ తరువాయి

బస్‌బేలు నిర్మాణం, ప్రయాణికులు కూర్చొనేందుకు బెంచీలు, ఫ్యాన్‌లు, తాగునీరు సదుపాయంతోపాటు ఆ ప్రాంతం పేరు తెలిసేలా ఎల్‌ఈడీ నేమ్‌ప్లేట్‌లు ఏర్పాటు చేశారు. పగటిపూటే కాకుండా రాత్రివేళల్లో కూడా చూసేవారిని ఆకట్టుకునేలా బస్‌బేలను అభివృద్ధి చేశారు. అయితే వీటిని నిర్వహించడంలో జీవీఎంసీ, ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో రాత్రివేళ ఆకతాయిలు వాటిల్లో చేరి ఫ్యాన్లు, లైట్లను తీసుకువెళ్లిపోవడం, ఎలివేషన్ బోర్డులను పీకేయడం చేస్తున్నారు. అదేవిధంగా నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో కొన్నిచోట్ల షీట్లు ఊడి వేలాడుతున్నాయి. దీంతో ప్రయాణికులు వాటిల్లో కూర్చొనేందుకు కూడా అవకాశం ఉండడం లేదు. ఇంతవరకు స్మార్ట్ లుక్‌తో అందరినీ కట్టిపడేసిన బస్‌బేలు ఇప్పుడు అందవిహీనంగా దర్శనమిస్తున్నాయి. రూ.కోట్లు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన బస్‌బేలు రెండేళ్లు తిరిగేసరికి మూలకు చేరిపోవడంపై నగరవాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఏదైనా అభివృద్ధి చేసినప్పుడు దానిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత తీసుకోవాలన్న విషయాన్ని జీవీఎంసీ, ఆర్టీసీ శాఖలు విస్మరించడం దారుణమని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా బస్టాప్‌ల నిర్వహణపై దృష్టిసారించాలని డిమాండ్ చేస్తున్నారు.

నేటి నుంచి ఆటోమ్యుటేషన్

... 5వ పేజీ తరువాయి

బకాయిలు కట్టాలని నోటీసులు ఏమీ రావు. దీంతో పాటు కొళాయి కనెక్షన్ పేరు కూడా రికార్డుల్లో మారుతుంది. దశల వారీగా విద్యుత్ మీటరు పేరు కూడా మార్చడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతానికి జీవీఎంసీ, రిజిస్ట్రేషన్ల శాఖ రికార్డులను లింక్ చేశారు. త్వరలో సంబంధిత విభాగాలతోను అనుసంధానం చేయనున్నారు.

రెస్టో బార్ల నిర్మాణం అక్రమం

... 5వ పేజీ తరువాయి

తమకు తెలియదని బకాయించారు. విరాగో రెస్టో బార్ నిర్వాహకులు తాము కేవలం లీజుదారులమేనని పేర్కొన్నారు. అయితే ఆ భూమికి సంబంధించిన డాక్యుమెంట్, ఈసీ కాపీ, 30అడుగుల మాస్టర్‌ప్లాన్ రహదారి, భవనం డ్రాయింగ్ అన్నీ సమర్పించాలని జీవీఎంసీ అధికారులు ఆదేశించారు. ఈ వివరణలన్నీ హైకోర్టుకు సమర్పించి, అక్కడ నుంచి వచ్చే ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. హైకోర్టులో కమిటీ నివేదిక కూడా ఉన్నందున చర్యలకు సిఫారసు చేసే అవకాశం ఉందని మూర్తియాదవ్ పేర్కొన్నారు.

ప్రో కబడ్డీకి వేదికగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

యుపీ యోధా...మొత్తం 12 జట్లు తలపడనున్నాయి.

దాదాపు ఏడేళ్ల తర్వాత

2014లో ఇండియన్ ప్రొఫెషనల్ కబడ్డీ లీగ్ తొలి సీజన్ టోర్నీ విశాఖ నుంచే ప్రారంభం కావడం విశేషం. తెలుగు టైటాన్స్ హోమ్ టీమ్‌గా ఆగస్టు 16 నుంచి 19 వరకూ జరిగిన ఏడు మ్యాచ్‌లకు పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం వేదికైంది. ఆ తర్వాత పీకేఎల్ సీజన్-3 టోర్నీకి సంబంధించి 2016లో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 2 వరకూమరో ఏడు మ్యాచ్‌లు జరిగాయి. చివరిగా పీకేఎల్ సీజన్-6కు సంబంధించి 2018లో డిసెంబరు 7 నుంచి 13 వరకూ జరిగిన 11 మ్యాచ్‌లకు పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా నిలిచింది. ఆ తర్వాత జరిగిన సీజన్లకు తెలుగు టైటాన్స్ యాజమాన్యం హోమ్ గ్రౌండ్‌గా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియాన్ని వేదిక చేసుకున్నది. దాదాపు ఏడేళ్ల తర్వాత ఈ ఏడాది ఆగస్టు 29 నుంచి జరగనున్న పీకేఎల్ సీజన్-12 టోర్నీకి విశాఖ ఆతిథ్యమివ్వనుంది.

సైబర్ ముఠాల చేతిలో తెలుగు యువకులు

... 5వ పేజీ తరువాయి

తీసుకుని వాహనాలు ఎక్కించారు. వారి కళ్లకు గంతలు కట్టి సుమారు 15 వాహనాలు మార్చి, ఒకటిన్నర రోజులు వాహనాల్లోనే వేర్వేరు ప్రాంతాలు తిప్పారు. చివరకు ఆనవాళ్లు కూడా తెలియని ఒకచోట గదిలో ఉంచారు. ఎక్కడకు తీసుకువచ్చారని ముఠా సభ్యులను ఇద్దరు యువకులు ప్రశ్నించగా చైనా జాతీయుల మాదిరిగా ఉన్న కొందరువచ్చి వారిని కొట్టడంతో అందరూ భయభ్రాంతులకు గురయ్యారు. అందరూ ఆడవారి గొంతుతో ఫోన్‌లో మాట్లాడి సైబర్‌స్కామ్ చేయాలని ఆదేశించారు. తమకు అంతగా ఇంగ్లీష్‌రాదని, చాటింగ్ కూడా సరిగా చేయలేమని ఒక యువకుడు చెప్పగా, అతడిని గదిలోకి తీసుకువెళ్లి ఇనుప హాకీ స్టిక్‌తో రక్తం వచ్చేలా కొట్టారు. దీంతో అందరూ భయపడి సైబర్‌స్కామ్ చేయడం ప్రారంభించారు. రోజుకు మొదట 16 గంటలు, తర్వాత 18 గంటలు, తర్వాత 20 గంటలు పనిచేయాలని చెప్పడంతో వారం గడిచేసరికి తాము చేయలేమని చేతులెత్తేయగా కొట్టడంతోపాటు దుస్తులు విప్పించి చిత్రహింసలకు గురిచేశారు. తాము ఇంకా వారి వేధింపులను తట్టుకోలేమని, ఫోన్ చేయడానికి కూడా అవకాశం లేకుండా ఒకరు కాపలా ఉంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తాము ఉంటున్న లొకేషన్‌ను పంపిస్తామని, ఆ ముఠా చేతుల్లోనుంచి తమను రక్షించి ఇండియా వచ్చేలా చేయాలని పవన్‌కల్యాణ్‌ను వేడుకున్నారు. ఇంతలో ఎవరో వస్తున్నట్టు చప్పుడు కావడంతో వీడియోను ఆపేశారు. అయితే వీడియోలో మాట్లాడిన వారి పూర్తి వివరాలు మాత్రం తెలియలేదు. దీనిపై ఇప్పటికే నగర పోలీసులు దృష్టిసారించి వారిని గుర్తించే ప్రయత్నాలు ప్రారంభించినట్టు తెలిసింది.

భూమాయ

... 5వ పేజీ తరువాయి

ఇస్తారు. దీనికి అనుగుణంగా ఆనందపురం రెవెన్యూ అధికారులు ఐదు ఎకరాలు విడిచిపెట్టి మిగిలిన 1.35 ఎకరాలు స్వాధీనం చేసుకున్నారు. అయితే సదరు వ్యక్తులు 6.35 ఎకరాలకు క్లెయిమ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో వైసీపీ నేతల హస్తం ఉందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై గ్రామానికి చెందిన ఒకరు..ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భూసమీకరణకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ద్వారకా బస్‌స్టేషన్‌లో కలెక్టర్ తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

కాంప్లెక్స్‌లోని స్టాళ్లను పరిశీలించి అన్ని రకాల ఐటమ్స్ ఎంఆర్‌పీకి అమ్ముతున్నారా లేదా అని ఆరా తీశారు. కాంప్లెక్సు నిర్వాహణపై కలెక్టర్ సంతృప్తిని వ్యక్తంచేశారు. బస్సుల్లో కిటికీ కర్టెన్స్‌ను తరచూ మారుస్తూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.పద్మావతి, సెక్యూరిటీ ఆఫీసర్ ఐవీవీపీ దుర్గాప్రసాద్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ నాయుడు, పలువురు అధికారులు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

సింహగిరిపై పెళ్లిళ్లకు రూ.10 వేలు చార్జి

... 5వ పేజీ తరువాయి

అధికారులు సమ్మతించిన స్థలాల్లో వివాహాలకు అనుమతిస్తారు. వివాహం తరువాత మూడు గంటలలోపు అందుకు వాడిన కుర్చీలు, మండపాలు, సోఫాలు, తదితరాలను అక్కడ నుంచి ఖాళీ చేయాలి. వివాహం చేసుకోదలచిన వారి నుంచి పారిశుధ్యం నిమిత్తం రూ.2 వేలు, అడ్వాన్స్ రూపంలో రూ.5 వేలు వసూలు చేసి పెళ్లి అనంతరం తిరిగి ఇచ్చే విధంగా పీఆర్‌ఓ కార్యాలయంలో సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని ఈఓ ఆదేశించారు.

'వైసీపీ నేత క్షమాపణ చెప్పాలి'



దీక్షకు మద్దతు తెలుపుతున్న కూటమి నాయకులు

జ్ఞానాపురం జూలై 31(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 41వార్డులో నిర్వహించిన బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకుడు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల శ్రీధర్ స్థానిక ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో జనసేన కార్యకర్తలు ఆగ్రహించి గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ నేత క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షకు వార్డులోని కూటమి నాయకులు మద్దతు పలికారు.

ఎక్కడ చూసినా చెత్త కుప్పలే!



రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

మురళీనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 49వ వార్డు నివాసిత ప్రాంతాల్లో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బర్మాక్యాంప్, ఎల్‌బీనగర్, మాణిక్యాంబ కాలనీ గెడ్డ సమీప నివాసినత ప్రాంతాల్లో చెత్త బాగా పేరుకుపోయింది. దీనిపై సచివాలయ సిబ్బంది, వార్డు శానిటరీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

జ్ఞానాపురం జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ప్రముఖ పాఠశాల సమీపంలో గురువారం గుర్తుతెలయని వ్యక్తి మరణించడంతో 41వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మధుబాబు, రవిబాబు ఆర్థిక సహాయం చేసి 'అవర్‌హ్యాండ్' స్వచ్ఛంద సంస్థకు మృతదేహాన్ని అప్పగించారు. ఈ సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో కాన్వెంట్ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి.

తాగునీటి పైప్‌లైన్లలో డ్రైనేజీ నీరు

» సమస్య పరిష్కరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతి



జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న కార్పొరేటర్

మహారాణిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్లు లీకవుతూ పక్కనే ఉన్న మంచినీటి పైప్‌లైన్లలో కలిసిపోయి తాగునీరు కలుషితం అవుతోందని 38వ వార్డు కార్పొరేటర్ విజయలక్ష్మి నరసింహాచారి అన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, మేయర్ పీలా శ్రీనివాసరావుకు గురువారం వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత నీరు తాగడం వల్ల ప్రజలు రోగాలా పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలలుగా జీవీఎంసీ యూజీడీ విభాగంలో డీఈ, ఏఈ అధికారులకు ప్రజల సమస్యల గురించి వివరించినా ఫలితం ఉండడం లేదని అన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని నరసింహాచారి కోరారు.

అలాగే ఫిషింగ్ హార్బర్, బీచ్‌రోడ్డు, పోర్టు రోడ్డుకు ఆనుకుని ఉన్న సీసీ రోడ్లలో అండర్ గ్రౌండ్ కేబుల్ పనుల కోసం రోడ్డును తవ్వి డబ్రిస్ వదిలేశారని, దీని వల్ల రహదారులు అస్తవ్యస్తంగా మారాయని వినతి పత్రాల్లో పేర్కొన్నారు.

కుంచించుకుపోతున్న గెడ్డలు



ఆక్రమణకు గురైన రెడ్డికంచరపాలెం గెడ్డ

కంచరపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 54, 55 వార్డుల పరిధిలో పలువురి ఆక్రమణ కారణంగా ప్రధాన గెడ్డలు కుచించుకుపోతున్నాయి. ధర్మానగర్, అశోక్‌నగర్, రెడ్డికంచరపాలెం, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, బాపూజీనగర్ తదితర ప్రాంతాల్లోని ప్రధాన గెడ్డలు ఆక్రమణకు గురయ్యాయి. గెడ్డలకు ఇరువైపులా ఉండే గృహాలు క్రమేపీ ముందుకు జరుగుతుండడంతో అవి కాలువల మాదిరి కుచించుకుపోతున్నాయి. ఇలా ఇష్టమొచ్చినట్టు ఆక్రమించేడ యం వల్ల కొత్తవాడ వీధి, సాయిబాబా గుడి వద్ద, వివేకానంద వీధిలో ఉన్న గెడ్డల్లో నీరు ప్రవహించేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో పాటు గెడ్డలకు రక్షణ గోడల నిర్మాణం జరగకపోవడంతో పురుగులు, పాములు సమీపంలో గల గృహాల్లోకి చేరుతున్నాయి. ఇప్పటికైనా కార్పొరేటర్లు దృష్టి సారించి గెడ్డల వద్ద రక్షణ గోడల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. రానున్నది వర్షాకాలం.. గెడ్డలలో మురుగు సజావుగా ప్రవహించడానికి పూడికలు తొలగించడంతోపాటు రిటర్నింగ్ వాల్స్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎం చంద్రబాబు మైనారిటీల పక్షపాతి

ఏపీ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ మస్తాక్ అహ్మద్



సభలో మాట్లాడుతన్న షేక్ మస్తాక్

మహారాణిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రిస్టియన్లు, ముస్లింల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఏపీ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ మస్తాక్ అహ్మద్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ముస్లిం, క్రిస్టియన్ నాయకులతో ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీ కార్పొరేషన్ ద్వారా లోన్లు ఇప్పించి చేయూత ఇస్తున్న ఘనత కూటమికే దక్కుతుందని అన్నారు. ఈ లోన్లను మైనారిటీకి చెందిన వారు సద్వినియోగం చేసుకోవాని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ చిన రెహమాన్ మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ



ఫుట్‌పాత్ ఆక్రమణ కారణంగా స్తంభించిన ట్రాఫిక్

మద్రిపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే మద్రిపాలెం ఏరియాలో ఫుట్‌పాత్‌లను, రోడ్డును చిరువర్తకులు ఆక్రమించేస్తున్నారు. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిరువర్తకులు రోడ్డుకు ఆనుకుని వ్యాపారం చేసుకుంటూ వారికి సంబంధించిన వస్తువులను ఫుట్‌పాత్‌లపై పెట్టి ఆక్రమిస్తున్నారు. తోపుడుబండ్ల మీద వ్యాపారం చేసుకునే వాళ్లు కూడా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వారి వ్యాపారాలు సాగిస్తున్నారు. నడవడానికి కూడా చోటు లేక పాదచారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్య మరింత ఉంటుంది ఆ సమయాల్లో రోడ్ల మీదకు రావాలంటేనే భయంగా ఉన్నదని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రహదారులపై భవన నిర్మాణ సామగ్రి

మురళీనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో జోరుగా సాగుతున్న నిర్మాణాలతో రోడ్ల నిండా వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. భవన నిర్మాణ సామగ్రి రోడ్డుమీదే పోసేస్తున్నారు. నిర్మాణానికి ముందే రోడ్డుని ఆక్రమించి టెంట్లు, తాత్కాలిక గుడారాలు వేసి ఆక్రమిస్తున్నారు. వాచ్‌మ్యాన్ నివాసాలు, మెటీరియల్ డంప్ చేసి రోడ్డుని సొంత స్థలంగా వాడేస్తున్నారు. ఇంతక ముందు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, జోన్-5 జడ్సీ పర్యటనల్లో ప్రత్యక్షంగా పరిశీలించి నిర్మాణ సామగ్రి వేసిన వారిపై కేసులు నమోదు చేసి నగర శుభ్రతకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు మారినప్పుడల్లా వార్డుల్లో రాకపోకలకు వీలు లేకుండా రోడ్లమీద ఇసుక పోస్తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డుపైనే వేసిన భవన నిర్మాణ సామగ్రి



70వ వార్డులో వెలుగుతున్న వీధి దీపాలు

నిరంతరాయంగా వెలుగుతున్న వీధి దీపాలు

కూర్మన్నపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు పరిధి డ్రైవర్స్ కాలనీలో నిరంతరాయంగా విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. గత కొద్దిరోజులుగా పలు కాలనీల్లోని వీధి లైట్లు పగలు, రాత్రి అనే తేడా లేకుండా వెలుగుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతుండే.. ఇక్కడ మాత్రం 24 గంటలూ వెలుగుతుండడం శోచనీయం. ఇప్పటికైనా విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడి వీధి దీపాల నిర్వహణ పట్ల శ్రద్ధ చూపాలని పలువురు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్కాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జనతాకాలనీ, దుర్గానగర్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం నుంచి 11 గంటల వరకు జనతా కాలనీ, వెంకన్నపాలెం, ఇండస్ట్రియల్ కాలనీ, రామకృష్ణాపురం, హెచ్‌పీసీఎల్ ప్రాంతం, ఎంఎంటీ ప్రాంతం, సెయింట్ ఆన్స్ కాలేజీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు దుర్గానగర్, ఏఎస్ఆర్ కాలనీ, జీపీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, టీడీపీ కాలనీ, అంబేడ్కర్ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

'ఉక్కు'కు పటిష్ట భద్రత

ఉక్కుటౌన్‌షిప్, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్వాంతంత్ర్య దినోత్సవం దృష్ట్యా కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో స్టీల్ ప్లాంటులో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. తీర ప్రాంతంలో గల స్టీల్ ప్లాంట్ కావడంతో భద్రతను పెంచారు.ప్లాంట్ ప్రధాన గేటు, విస్తరణ గేటు, బీసీ గేటుతో పాటు కర్మాగారం లోపల పలు కీలక విభాగాల వద్ద అదనపు సిబ్బందిని నియమించారు. ప్లాంట్‌లోకి ప్రవేశించే ప్రతి ఒక్కరినీ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఎక్కడైనా ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే సీఐఎస్ఎఫ్ అధికారులకు గానీ స్టీల్ ప్లాంట్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

రోడ్డు పనులకు భూమి పూజ

మల్కాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ములగాడ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఏఈ నిరంజన్ భూమి పూజ చేశారు. ములగాడ నుంచి శ్రావణి షిప్పింగ్, అక్కడనుంచి షీలానగర్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు పనులు చేపడతామన్నారు. ఈ మార్గంలో ప్రయాణాలు సజావుగా సాగించేందుకు వీలుగా కొత్తగా రోడ్డు వేస్తామన్నారు. నాయకులు శీరపు నరసింగరావు, నాగేశ్వరరావు, మహేశ్‌రెడ్డి, కె.శ్రీనివాస్, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 48, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 44, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 32, బీరకాయలు 48, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 34, క్యాబేజీ 20, క్యారెట్ 48, దొండకాయలు 42, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 66, బరబాటి 46, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 38, చిలగడదుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 98, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	460
విజయనగరం	464
శ్రీకాకుళం	464

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	83
లైవ్ ధర	103
విత్ స్కిన్	176
స్కిన్‌లెస్	186

పాఠశాలల అభివృద్ధికి పరిశ్రమలు ముందుకు రావాలి

▸ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి వివిధ పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ సుమారు రూ.ఐదు లక్షల వ్యయంతో మింది హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందరూ ఉన్నల లక్ష్యాలను నిర్దేశించుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. అదేవిధంగా సర్కారు బడుల అభివృద్ధిలో పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుడివాడ అనూష, కోరమాండల్ అధికారులు ఎం.జ్ఞానసుందరం, కేవీవీఎస్ నారాయణ, సి.జయగోపాల్, శ్రీనివాసరావు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాతృశ్రీ నగర్‌లో ఆగని ఆక్రమణల పర్వం

తాజాగా మరో 3 షెడ్ల నిర్మాణం, ఏడింటి కోసం సామగ్రి సిద్ధం

'ఆంధ్రజ్యోతి' కథనంతో ఆ ప్రాంతాన్ని సందర్శించిన కార్పొరేటర్, పనులు నిలిపివేయాలని ఆదేశం



మాతృశ్రీ నగర్‌లో అక్రమంగా షెడ్లను నిర్మిస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు పరిధి మాతృశ్రీ నగర్‌లో ప్రభుత్వ స్థలాల కబ్జాలు ఆగకపోగా... రోజురోజుకు అధికమవుతున్నాయి. మంగళవారం రాత్రికి రాత్రే కొన్ని షెడ్లు వెలయగా, గురువారం మరో 3 షెడ్లను నిర్మించడంతో పాటు మరో 7 షెడ్ల కోసం నిర్మాణ సామగ్రిని సిద్ధం చేశారు. కూర్మన్నపాలెంలోని సర్వే నంబర్-27లో ప్రభుత్వ స్థలంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు, ప్రజా సంఘాల నాయకులు ఫిర్యాదులు చేస్తున్నా రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సర్వే నంబర్-27లో సుమారు 2.5 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. దీనిపై గతంలో వివాదాలు చోటుచేసుకోవడంతో రెవెన్యూ అధికారులు అప్పట్లో ఆ స్థలం చుట్టూ ప్రహరీని నిర్మించారు. అయితే మధ్యలో రోడ్డు ఉండడంతో కొంత భాగం ప్రహరీ నిర్మించకుండా విడిచిపెట్టారు.

గత కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న ఈ స్థలంలో ఇప్పుడు కొంతమంది అక్రమార్కులు షెడ్లను నిర్మిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ రేకుల షెడ్ల నిర్మాణానికి కాంట్రాక్టు కుదుర్చుకున్నట్టు తెలిసింది. కాగా గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'మాతృశ్రీ నగర్‌లో రాత్రికి రాత్రే వెలసిన షెడ్లు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి కార్పొరేటర్ కోటేశ్వరరావు స్పందించి ఆయా రేకుల షెడ్లను పరిశీలించారు. షెడ్ల నిర్మాణ పనులు చేపడుతున్న మేస్త్రిని పిలిచి వెంటనే పనులు ఆపాలని ఆదేశించారు. పునాదులు తీసుకున్న ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకుని, పనులు చేస్తున్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలావుండగా 'ఆంధ్రజ్యోతి' కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాల ప్రాంతాలను పరిశీలించినట్టు తెలిసింది.

నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తి

ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నిర్ణీత సమయంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ విభాగాధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒప్పందం ప్రకారం జీవీఎంసీ అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలోనే పూర్తి చేయాలన్నారు. విశాఖ నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్లు కూడా భాగస్వాములేనని, ప్రతి కాంట్రాక్టరు తమకు ఇచ్చిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. టెండర్ కాల్ ఫర్ చేసినప్పటి నుంచి పనులు పూర్తయ్యే వరకు పనులలో ఎటువంటి జాప్యం ఉండరాదని స్పష్టం చేశారు. ప్రతి పని రూల్ బుక్ ప్రకారం పూర్తయ్యేలా రోజూ పనులను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. సచివాలయం పరిధిలో రెండు లేదా మూడు వర్కులు ఉంటాయని, వాటిని పరిశీలించే బాధ్యత వార్డు ఎమినిటీ కార్యదర్శులను భాగస్వామ్యం చేస్తూ ప్రతి రోజూ ఆయా పనులను పర్యవేక్షించాలన్నారు. పనులు నిర్ణయించక ముందే ఆ పనిలో ఆటంకాలను గుర్తించి అన్నీ సరిపోయిన పిదప టెండర్లు పిలవాలని కమిషనర్ పేర్కొన్నారు. పనుల్లో సమస్యలుంటే జోనల్ కమిషనర్, ఆపై అధికారులకు తెలియపరిచాలని, పనుల ఆలస్యంపై కార్యనిర్వాహక ఇంజనీర్లు ఆరా తీయాలన్నారు. ఇకపై పనులు సకాలంలో పూర్తి అవకపోవడానికి వేరే సాకులను చెప్పరాదని హెచ్చరించారు. ముఖ్యంగా పనులు చేసేటప్పుడే క్వాలిటీ కంట్రోల్ ప్రతినిధులు ఆ పనుల నాణ్యతలో ఎటువంటి రాజీ లేకుండా పనిచేయడంతో పాటు ఆ పని మొత్తం నమోదు చేయాలన్నారు. నాణ్యతలో లోపం వలన ఎన్నో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున కాంట్రాక్టర్ వినియోగించే మెటీరియల్‌లను తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. కాంట్రాక్టర్ పనులు పూర్తి చేసిన వెంటనే వరుస క్రమంలో బిల్లులు చెల్లించేందుకు సహకరిస్తామని కాంట్రాక్టర్లకు కమిషనర్ తెలిపారు.

ఈ సందర్భంగా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఎప్పటినుంచో ఉన్న ఈఎండీలను వెంటనే జారీ చేయాలని, అలాగే పనులు చేసిన పిదప బిల్లుల ప్రక్రియకు వచ్చేసరికి బడ్జెట్ లేదని, ఆ బిల్లును మళ్లీ బిల్లు జనరేట్ అయ్యే వరకు మంజూరు కానందున ఇబ్బందులు ఎదురవుతున్నాయని కమిషనర్‌కు వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. ఏడీసీ ఎస్ఎస్ వర్మను వాటిని పరిశీలించాలని ఆదేశించారు. సమావేశంలో పర్యవేక్షక ఇంజనీర్లు కేవీఎన్ రవి, పీవీవీ సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించండి మహాప్రభో..

▸ జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఉక్కు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులు



ఉక్కుటౌన్‌షిప్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో విధులు నిర్వహించిన నిర్వాసిత కాంట్రాక్టు కార్మికుల్లో కొంతమందిని ఇటీవల ఉక్కు యాజమాన్యం తొలగించడంతో వారంతా రోడ్డునపడ్డారు. వారంతా తమకు తిరిగి ఉపాధి కల్పించాలని కోరుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఇటీవల సుమారు 350 మంది నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను విధుల నుంచి తొలగించారు. దీంతో వారంతా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిరప్రసాద్, స్టీల్ ప్లాంట్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, ఉన్నతాధికారులు, ఇతర ఉక్కు అధికారులను కలుస్తూ తమను మళ్లీ పనుల్లోని తీసుకునేలా చూడాలని వేడుకుంటున్నారు. నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను తొలగించబోమని ఉక్కు యాజమాన్యం గతంలో ఆర్ఎల్‌సీ (రీజనల్ లేబర్ కమిషనర్) సమక్షంలో జరిగిన చర్చల్లో హామీ ఇచ్చిందని, అయినప్పటికీ వారిని టార్గెట్ చేసి తొలగించడం దారుణమని పలువురు కార్మిక నాయకులు మండిపడుతున్నారు.

ఇదిలావుండగా తాము నిర్వాసిత కోటాలో ప్లాంటులో విధుల్లో చేరామని, ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను జత చేసి అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు సమర్పిస్తున్నారు. ప్లాంట్ కోసం తాము సర్వం కోల్పోయినప్పటికీ ఉక్కు యాజమాన్యం శాశ్వత ఉపాధి కల్పించకుండా కాంట్రాక్టు కార్మికులుగా విధుల్లోకి తీసుకుందని, ఇప్పుడు ఆ పనుల నుంచి కూడా తొలగించడంతో కుటుంబాలతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు నిర్వాసిత కాంటాక్టు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను త్వరితంగా విధుల్లోకి తీసుకోకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని నిర్వాసిత నాయకులు హెచ్చరిస్తున్నారు.

'సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోండి

ఏపీఈపీడీసీఎల్ జోన్-3 డీఈ సింహాచలం నాయుడు



ఇంటింటికీ వెళ్లి పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఈ శ్యామ్, తదితరులు

గోపాలపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా విద్యుత్ వినియోగదారులకు ఎంతో మేలు జరుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్-3 డీఈ సింహాచలంనాయుడు అన్నారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై గోపాలపట్నంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా 1కేవీ సోలార్ రూఫ్‌టాప్‌కు రూ.70 వేలు ఖర్చవుతుందని, ఇందులో రూ.30 వేలు వినియోగదారుడికి సబ్సిడీ లభిస్తుందన్నారు. అదేవిధంగా 2కేవీ సోలార్ రూఫ్‌టాప్‌కు రూ.1.50 లక్షల వ్యయమైతే రూ.60 వేల సబ్సిడీ లభిస్తుందన్నారు. 3కిలో వాట్స్ లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యం గల రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటే రూ.78 వేల సబ్సిడీ లభిస్తుందని వివరించారు. అందువల్ల అందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగా వుడా కాలనీ, బాపూజీ నగర్ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు కరపత్రాలనుఎ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఈ ఎస్.అప్పన్నబాబు, ఏఈలు శ్యామ్, రవికుమార్, పద్మనాభం, సురేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్యుల సంక్షేమానికి కృషి

గాజువాక, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆర్య వైశ్యుల సంక్షేమానికి తాము కృషి చేస్తున్నామని, సేవలను మరింత విస్తృతం చేస్తామని గాజువాక ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. 66వ వార్డు పరిధి కైలాసనగర్‌లో గురువారం జరిగిన సమావేశంలో సంఘం సభ్యుల సంక్షేమానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. సభ్యులకు ఏ ఇబ్బంది వచ్చినా సంఘం అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వాసవీమాత ఆలయంలో గల వేదపండితుల తల్లి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్షా 13 వేల నగదును అందజేశారు. అదేవిధంగా సభ్యుల కోసం స్క్రాచ్ కార్డులను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు పీపీఎస్ నాగేశ్వరరావు, గుప్త, కె.మంగరాజు, కె.సతీశ్, కె.శ్రీను రమేశ్, జగన్నాథం, శరత్, తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లను సందర్శించిన మార్కెట్ కమిటీ డైరెక్టర్

గాజువాక, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గాజువాక, స్టీల్ ప్లాంట్ రైతుబజార్లను మార్కెట్ కమిటీ డైరెక్టర్ స్వర్ణపూడి రాంబాయి గురువారం సందర్శించారు. రైతుబజార్లలో వినియోగదారులకు అందుతున్న సేవలు, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తెలపాలని, వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. డైరెక్టర్ వెంట స్థానిక నాయకులు ఎండీ రఫీ, అన్సర్ వల్లీ, అడుసుమల్లి దీప్తి, కోగంటి లెనిన్‌బాబు, సత్యనారాయణ ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో తిరుప్పావడ సేవ



శ్రీవారి ఆకారంలో తీర్చిదిద్దిన పులిహోర

అక్కిరెడ్డిపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రావణ గురువారం సందర్భంగా ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన తిరుప్పావడ సేవ నిర్వహించారు. వేద పండితులు వేంకటేశ్వర స్వామిని పంచామృతాలతో అభిషేకించాక పలు రకాల పుష్పాలు, తులసీ దళాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 25 కిలోల పులిహోరను స్వామివారి ముందు ప్రత్యేక వేదికపై శ్రీవారి ఆకారంలో రాశులుగా పోసి పండ్లు, పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దిన వేదపండితులు శ్రీనివాస గద్యాన్ని ఆలపిస్తూ నైవేద్యంగా సమర్పించారు. అనతరం భక్తులకు స్వామివారి నేత్ర, నిజరూప దర్శన భాగ్యం కల్పించారు.

గరుడాద్రిపై వైభవంగా సుదర్శన హోమం

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి గరుడాద్రిపై గల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరాలయ ఆవరణలో వైభవంగా సుదర్శన హోమం జరిపారు. ప్రజలంతా క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆలయ కమిటీ ఈ హోమం నిర్వహించింది. హిందూ ధర్మరక్షణ సమితి అధ్యక్షురాలు కొత్తలంక భువనేశ్వరిశర్మ హోమంలో పాల్గొన్నారు. అనంతరం శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

దువ్వాడ ట్రాఫిక్ సీఐ వెంకటరావు

కూర్మన్నపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అతి వేగం ప్రాణాంతకమని, ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని దువ్వాడ ట్రాఫిక్ సీఐ కె.వెంకటరావు అన్నారు. గురువారం వడ్లపూడిలో వాహన చోదకులకు ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులందరూ విధిగా రహదారి భద్రతా నియమాలను పాటించాలని, పాత చలానాలు ఉంటే క్లియర్ చేయాలని, త్రిపుల్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్, ర్యాష్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయరాదన్నారు. అలా పట్టుబడిన వాహనదారులకు అవగాహన కల్పించడంతో పాటు జరిమానాలు విధిస్తున్నామన్నారు. అలాగే కార్లు నడిపేవారందరూ సీటు బెల్టు ధరించడంతో పాటు అన్ని పత్రాలను కలిగివుండాలన్నారు.

85వ వార్డులో వీధి లైట్ల ఏర్పాటు

అగనంపూడి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీధి లైట్ల ఏర్పాటుకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టామని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి అన్నారు. ఈ క్రమంలో ఫార్మాసిటీ పునరావాస కాలనీ నుంచి వినాయకనగర్ ప్రధాన రహదారిలో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన వీధి లైట్లను ఆమె ప్రారంభించారు. కూటమి నాయకులు ఇల్లపు ప్రసాద్, అర్జున్, మూర్తి, సత్యం, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



సామాజిక భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పి.గణబాబు

58వ వార్డులో సామాజిక భవనాలు ప్రారంభం

మల్కాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ అంతర్జాతీయ ఎరువుల కర్మాగారం సౌజన్యంతో 58వ వార్డు పరిధి గుల్లలపాలెం, ములగాడల్లో నిర్మించిన సామాజిక భవనాలను ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరమాండల్ అంతర్జాతీయ ఎరువుల కర్మాగారం సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జ్ఞానసుందరం, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ కేవీవీఎస్ నారాయణ, సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రంగకుమార్, సీఎస్సార్ హెడ్ జయగోపాల్, జీఎం (హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాస్, డిప్యూటీ జీఎం వెంకటరమణ, సీవీవో నారాయణపాత్రుడు, స్థానిక నాయకులు శీరం ఉమామహేశ్వరి, కోరాడ శ్రీనివాస్, అంగ దుర్గాప్రశాంతి, పి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేయొద్దు



ర్యాలీలో పాల్గొన్న ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు

మల్కాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను పెట్టవద్దని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం మల్కాపురం నుంచి శ్రీహరిపురం వరకు ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి అదానీ విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేసి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపేందుకు సిద్ధపడుతుండడం సిగ్గుచేటన్నారు. తక్షణమే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు యోచనను విరమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జోన్ అధ్యక్షుడు కె.పెంటారావు, నాయకులు లక్ష్మణమూర్తి, కె.సత్యాంజనేయ, జి.రాంబాబు, ఆర్.విమల, తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌ను సందర్శించిన డీఈవో



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

అక్కిరెడ్డిపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌ను గురువారం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదులను, మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు కాసేపు పలు అంశాలను బోధించారు. విద్యార్థులందరూ మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తమ తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే ఉపాధ్యాయులతో డీఈవో సమావేశమై పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎంఎల్ఎస్ కాంతం ఉన్నారు.

భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలి

గాజువాక, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కణితి రోడ్డులో వాహనదారులు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్నారు. గాజువాకకు కీలకమైన కణితి రోడ్డును సింధియా వైపు గల కర్మాగారాలకు, ఆయా ప్రాంతాలకు వెళ్లేవారు ఎక్కువగా వినియోగిస్తారు. దీంతో నిత్యం వాహనాలతో ఈ మార్గం రద్దీగా ఉంటుంది. దీంతో ఈ రోడ్డును అరవై నుంచి ఎనభై అడుగుల మేరకు విస్తరించినప్పటికీ ట్రాఫిక్ సమస్య ఏ మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. ప్రధానంగా ఈ రోడ్డులోనే నిత్యావసర వస్తువులకు సంబంధించి హోల్‌సేల్ షాపులు, బంగారం దుకాణాలు, ప్రధాన కూరగాయల మార్కెట్‌తో పాటు అన్ని రకాల వస్తువులు లభించే వ్యాపార సంస్థలు ఉన్నాయి. అయితే ఈ మార్గంలో భారీ వాహనాలు ప్రవేశించకుండా స్టాపర్లను ఏర్పాటు చేసినప్పటికీ నియంత్రించే సిబ్బంది లేక భారీ వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగిస్తున్నాయి. అందువల్ల ఈ మార్గంలో ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులతో పాటో పలువురు వ్యాపారులు కోరుతున్నారు.

మందుబాబులకు రూ.90 వేల జరిమానా

పెందుర్తి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ముఖ్య కూడళ్లలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి పట్టుబడిన 9 మందికి రూ.90 వేలను రెండో స్పెషల్ జ్యూడీషియల్ కోర్టు జరిమానాగా విధించినట్టు ట్రాఫిక్ ఎస్ఐ నరసింహరాజు గురువారం తెలిపారు. చాలామంది మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరగుతున్నాయని ఆయనన్నారు.

ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసిన అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు గురువారం లేఖ రాశారు. ప్లాంటులో ఉపాధి కోసం నిర్వాసితులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని, ఈ క్రమంలో కాంట్రాక్టు పనులు చేస్తున్న నిర్వాసితులను కూడా విధుల నుంచి తొలగిస్తున్నారని పేర్కొన్నారు. ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను ఉక్కు యాజమాన్యం తొలగిస్తుండడంతో ఎంతోమంది కుటుంబాలతో రోడ్డున పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. అలాగే త్వరలో సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లను కలిసి సమస్యను విన్నవిస్తామని వారు పేర్కొన్నారు.

పలుచోట్ల 'సుపరిపాలనలో తొలి అడుగు'

వేపగుంట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డు పరిధి కృష్ణరాయపురం, సేనాతివానిపాలెంలలో గురువారం రాత్రి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండిబాబ్జి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో ప్రజలంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలో ఆనందంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బర నరసింహనాయుడు, చీర అప్పలరాజు, బి.చిన్న నూకరాజు, ఎ.అప్పలనాయుడు, మామిడి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఉక్కు నిర్వాసిత కాలనీ పిన మడకలో టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు అండిబోయిన మంగరాజు, వెంకటరమణ, శ్రీను, సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్‌లో సజీవ శిల్పకళ

ఆకట్టుకునేలా తీర్చిదిద్దిన జీవీఎంసీ


- అబ్బురపరుస్తున్న ఫ్లెమింగోలు
- ఆసక్తిగా పరిశీలిస్తున్న నగర వాసులు



ఆకట్టుకుంటున్న అమ్మ బొమ్మ



పార్కులో కొలువుదీరిన దుప్పిలు



పార్కులో ఏర్పాటు చేసిన కొంగ బొమ్మలు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కోతి బొమ్మ

విశాఖపట్నం/మాధవధార, జూలై 31, (ఆంధ్రజ్యోతి)

జాతీయరహదారిపై మద్దిలపాలెం నుంచి ఎన్‌ఏడీ జంక్షన్‌వైపు వెళుతుంటే రోడ్డుకు ఎడమవైపున గ్రీన్‌బెల్ట్‌లో ఫ్లెమింగోల (కొంగజాతి) గుంపు కనిపిస్తుంది. చూడగానే అవన్నీ నేలపై నడుస్తూ మేత మేస్తున్నట్టు అనిపించడంతో చాలా మంది ఆగి వాటిని ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. తీరా దగ్గరకు వెళ్లి చూసేసరికి అవి బొమ్మలు అని గుర్తించి అవాక్కవుతున్నారు.

నగర సుందరీకరణలో భాగంగా జాతీయరహదారికి ఇరువైపులా ఉన్న గ్రీన్‌బెల్ట్‌లో వాకింగ్‌ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, చిన్నపిల్లలు ఆడుకునే పార్కులుగా అభివృద్ధి చేస్తున్నారు. అందులో భాగంగానే 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్ వద్ద గ్రీన్‌బెల్ట్ వాకింగ్ ట్రాక్ మధ్యలో ప్రజలకు ఆహ్లాదం కలిగించేలా అందమైన ఫ్లెమింగోలు, దుప్పులు, తల్లి-పిల్ల కోతుల బొమ్మలను ఏర్పాటుచేస్తున్నారు. అందంగా తీర్చిదిద్ది, పార్కు మధ్యన ఓ పసిబిడ్డను చేతుల్లో లాలించే అమ్మ ఆకృతిని ఏర్పాటు చేశారు. తెల్లని రంగులో తీరైన డిజైన్‌లో ఓ పది అడుగుల ఎత్తున మాతృత్వపు గొప్పతనాన్ని చాటేలా అమర్చిన విగ్రహం విశేషంగా ఆకర్షిస్తోంది. అన్నీ ఫైబర్ బొమ్మలే అయినా కళాకారుల నైపుణ్యంతో నిజమైనవేనా అనే భ్రమను కలిగిస్తున్నాయి. జంతువులు, పక్షుల్ని పచ్చని చెట్ల మధ్య ఆడుతున్నట్టుగా కొలువుదీర్చిన తీరు మన్ననలు అందుకుంటోంది. విగ్రహం చుట్టూ వాకింగ్ ట్రాక్.. మధ్యన కుందేళ్లు, కొంగలు, కోతులు, అడవి దుప్పితో ట్రాక్‌ను సుందరంగా మలుస్తున్నారు. మారియట్ హోటల్ ఎదురుగా మహిళల కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్‌ను నిర్మించి, ధ్యానం చేసుకునే సదుపాయం కల్పిస్తున్నారు. ట్రాక్ పొడవు ఎక్కువగా ఉండడంతో రైతు బజారు రోడ్డులో ఉన్న వాటర్ ట్యాంక్ వరకు కలుపుతూ మధ్యన చిన్న కల్వర్టు మీదుగా ఇనుప రెయిలింగ్‌తో వాకర్స్‌కు మోడ్రన్ హంగుల్ని అందుబాటులోకి తెచ్చారు. తుది దశకు చేరిన ట్రాక్ పనులను పూర్తిచేసి, నిర్వహణ బాధ్యతలను స్థానిక స్త్రీశక్తి హెల్దీవాకర్స్ అసోసియేషన్‌కు అప్పగించనున్నారు. కాగా నవ్యాంధ్రస్కూల్ ఎదురుగా ప్రజలకు ఉచితంగా యోగా నేర్పించడంతోపాటు సాధన చేసేందుకు వీలుగా ప్రత్యేక పార్కు, పిల్లలు ఆడుకునేందుకు పరికరాలు ఏర్పాటుచేస్తుండడంతో ఆ ప్రాంతమంతా సరికొత్త అందాలతో సాక్షాత్కరిస్తోంది.

ప్రేమ పేరుతో యువతులకు గాలం

- ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని బెదిరించి డబ్బులు డిమాండ్
- నిందితుడి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు శ్రీను

గోపాలపట్నం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతులకు గాలం వేసి వారికి దగ్గరవుతాడు. ఆ తరువాత వారితో చనువుగా ఉన్న సమయంలో వీడియోలు, ఫొటోలు తీసి వాటిని సోషల్ మీడియాలో పెడతానని బెదిరించి డబ్బులు గుంజడాన్ని హాబీగా మార్చుకున్న నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం జోగంపేట గ్రామానికి చెందిన సరమండ శ్రీనుకు నగరానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో వీరు సన్నిహితంగా ఉన్న సమయంలో వీడియోలు, ఫొటోలు తీశాడు. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని యువతిని బెదిరించి, డబ్బులు డిమాండ్ చేయడం ప్రారంభించాడు. అయితే యువకుడి వేధింపులు తాళలేక బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో సీపీ ఆదేశాల మేరకు గోపాలపట్నం సీఐ ఆధ్వర్యంలోని బృందం గురువారం నిందితుడ్ని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించింది. కాగా గతంలో ఇదే తరహాలో ఓ యువతిపై వేధింపులకు పాల్పడిన ఘటనలో నిందితుడిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్టు పోలీసులు తెలిపారు.

జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా వెంకటేశ్వరరావు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఎస్‌డీవో

విశాఖపట్నం, స్పోర్ట్సు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడాభివృద్ధి అధికారిగా (డీఎస్‌డీవో) ఎస్.వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లా డీఎస్‌డీవో పనిచే స్తూ బదిలీపై వచ్చారు. కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌ను కలిసి రిపోర్టు చేశారు. ఇక్కడి డీఎస్‌డీవో జూన్ గ్యాలియట్ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు.

కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుకు పూర్తి సహకారం

పారిశ్రామికవేత్తలతో కలెక్టర్ హరేంధిరప్రసాద్



పారిశ్రామికవేత్తలతో మాట్లాడుతున్న కలెక్టర్

మహారాణిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల నిర్వహణ, కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం పూర్తిగా సహకరిస్తుందని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ హామీ ఇచ్చారు. కలెక్టరేట్‌లో గురువారం పారిశ్రామిక వేత్తలు, వివిధ విభాగాల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతాల్లో వసతుల కల్పనపై అధికారులు దృష్టిసారించాలని ఆదేశించారు. ఏపీఐఐసీ ద్వారా కేటాయించిన భూముల్లో నిర్ణీత సమయంలోగా పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐలా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఆటోనగర్ ఐటీ హిల్స్ ప్రాంతంలో ప్రత్యేక బస్టాప్ ఏర్పాటు చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశ్రామిక వేత్తలంతా పీ4 ద్వారా పేదరిక నిర్మూలనకు సహకరించాలని కోరారు. దిగువ స్థాయిలో ఉన్నవారికి తగిన ప్రోత్సాహం అందించాలన్నారు. దత్తత తీసుకునే విషయంలో ఎలాంటి ఒత్తిడీ లేదన్నారు. పూర్తి స్వచ్ఛంద కార్యక్రమమని స్పష్టం చేశారు.

అన్నక్యాంటీన్‌ను సందర్శించిన కలెక్టర్



భోజనం నాణ్యతపై ప్రశ్నిస్తున్న కలెక్టర్

మహారాణిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పరిధి ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం సమీపంలో అన్నక్యాంటీన్, ఫ్రూట్‌మార్కెట్‌ను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ గురు వారం సందర్శించారు మధ్యాహ్న భోజనం చేస్తున్న వారితో మాట్లాడారు. ఆహార నాణ్యత, రుచి, పరిశుభ్రత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చారు. కాగా ఫ్రూట్ మార్కెట్‌లో దుకాణాలను పరిశీలించి, పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు.

గోదావరి, రాయగడ ఎక్స్‌ప్రెస్‌లకు కోచ్‌ల మార్పు

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ-హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగించే గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727/12728), రాయగడ- గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17243/17244) రైళ్లకు కోచ్‌లను సవరించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సెప్టెంబరు 29 నుంచి గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728), సెప్టెంబరు 30 నుంచి విశాఖ-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ (12727) రైళ్లు ఒక ఫస్ట్ ఏసీ, మూడు సెకెండ్ ఏసీ,ఆరు థర్డ్ ఏసీ, ఆరు స్లీపర్, నాలుగు జనరల్ సెకెండ్ క్లాసు, ఒక సెకెండ్ క్లాసు కమ్ దివ్యాంగుల కమ్ లగేజి కోచ్‌లతో (మొత్తం 22) రాకపోకలు సాగిస్తాయి. అక్టోబరు ఒకటి నుంచి గుంటూరు, రాయగడ, 2 నుంచి రాయగడ-గుంటూరు రైళ్లు మూడుథర్డ్ ఏసీ, 12 స్లీపర్, మూడు సెకెండ్ క్లాసు, రెండు సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లతో నడవనున్నాయి.

జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంలకు అన్యాయం

- ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిరాజు

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ యాజమాన్యం కింద పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులను కాదని కేవలం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాశాఖాధికారి -1గా అదనపు బాధ్యతలు అప్పగించడంపై ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు దశాబ్దాలుగా ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యతో జడ్పీ పాఠశాలల టీచర్లకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. డీఎస్సీ ద్వారా రెండు యాజమాన్యాలలో నియమించబడినప్పటికీ పదోన్నతుల విషయంలో 50 సంవత్సరాల ముందున్న పద్ధతులనే కొనసాగించడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. దీని కారణంగా విద్యాశాఖలో పదోన్నతులు నిలిచిపోయావని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని కామన్ సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని ప్రతి ఉపాధ్యాయుడు కోరుకుంటున్నారన్నారు.

8న అప్పన్న ఆభరణాల తనిఖీ

సింహాచలం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆభరణాలను ఈనెల 8న ఫైవ్‌మన్ కమిటీ తనిఖీ చేస్తుందని ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. గత ఏడాది కడప ప్రాంతానికి చెందిన ప్రభాకరాచారి అప్పన్నకు భక్తులు సమర్పించిన రజిత, స్వర్ణ ఆభరణాల తూనికల్లో తేడాలున్నాయని, కొన్ని ఆభరణాలు మయమయ్యాయని, వాటి నిజాలు నిగ్గు తేల్చాలని దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ (ఆర్‌జేసి) కె.సుబ్బారావును విచారణకు ఆదేశించారు. దేవదాయశాఖ జ్యూవలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ పల్లం రాజు ఈ ఏడాది జనవరి 17, 18 తేదీల్లో రికార్డులను పరిశీలించారు. ఫిబ్రవరి 20 నుంచి ఆలయం, పద్మనిధి, ట్రెజరీలో ఆభరణాలను తూనికలు వేసి రికార్డులను సిద్ధం చేశారు. కాగా ఆభరణ ప్రదర్శనశాలలోని వస్తువులను తనిఖీ చేయలేదు. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియను పూర్తిచేయాలని విజయనగరం మాన్సాస్, అరసవల్లి దేవస్థానం ఈఓ ప్రసాద్ ఛైర్మన్‌గా ఫైవ్‌మన్ కమిటీని నియమించారు. ఈ కమిటీ 8న తనిఖీలు ప్రారంభించనుంది.

ముగ్గురు తహసీల్దార్లు పదవీ విరమణ



ల్యాండ్ ఎక్విజేషన్ స్పెషల్ తహసీల్దారు బీటీవీ రామారావును సత్కరిస్తున్న జేసీ మయూర్ అశోక్, చిత్రంలో కలెక్టర్, డీఆర్వో, భీమిలి ఆర్డీవో ఉన్నారు.

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తహసీల్దారు కేడర్ అధికారులైన కలెక్టరేట్ పాలనాధికారి కేవీ ఈశ్వరరావు, ఆర్డీవో కార్యాలయం పరిధి భూ అధిగ్రహణ ప్రత్యేక తహసీల్దారు బీటీవీ రామారావు, భీమిలి ఆర్డీవో కార్యాలయం పాలనాధికారి మనోరంజని గురువారం పదవీ విరమణ చేశారు. కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం ఏవో ఈశ్వరరావు దంపతులు, బీటీవీ రామారావుకు జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్. భవానీ శంకర్ సత్కరించారు. కార్యక్రమంలో భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, సిబ్బంది, జిల్లా రెవెన్యూ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కేర్ ఆస్పత్రిలో సంఘం హెల్త్ కార్డులు ప్రారంభం



హెల్త్ కార్డులతో కేర్ ఆస్పత్రి సీఓఓ, తదితరులు

ఆరిలోవ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర వాసులకు రాయితీతో కూడిన మెరుగైన వైద్యం అందించడానికి ఆరిలోవ కేర్ ఆస్పత్రిలో సంఘం పేరుతో హెల్త్ కార్డులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మయూఖ్ చౌదరి మాట్లాడుతూ హైదరాబాద్, ఇండోర్ కేర్ ఆస్పత్రుల్లో ఈ కార్డులను ప్రయోగాత్మకంగా ప్రారంభించామని, రోగులకు ఇవి ఊరటనిచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో విశాఖలోనూ ప్రత్యేక రాయితీ కూడిన కార్డులను అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. దశల వారీగా దేశంలోని అన్ని కేర్ ఆస్పత్రుల్లో అమ లు చేస్తామన్నారు. కాగా కార్డు పొందిన వారు మొదటిసారి వైద్యుల ఉచిత కన్సల్టేషన్ పొందవచ్చునని, ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ల్యాబ్ టెస్ట్‌లపై 2 0శాతం, మందులపై 15 శాతం రాయితీ అందిస్తున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో యాజమాన్య ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

నగరంలో పార్టీని బలహీన పరిచే కుట్రలు

- జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్



మాట్లాడుతున్న మూర్తియాదవ్

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఈనెల ఆరున జరిగే జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో జిల్లా నేతలు పార్టీని బలహీనపరిచేలా కుట్రచేస్తున్నారని ఆ పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ విమర్శించారు. దీనికి నిరసనగా తాను ఎన్నికలను బహిష్కరిస్తున్నానని ప్రకటించారు. వైసీపీ నుంచి వచ్చిన నేతలు పార్టీలో పెత్తనం చెలాయించి పార్టీ అధ్యక్షుడిని, అధిష్ఠానాన్ని తప్పుదారిపట్టిస్తున్నారని ఆరోపించారు. గాజుగ్లాసు గుర్తుపై గెలిచిన కార్పొరేటర్లను తొక్కేసి, వైసీపీ నుంచి వచ్చిన వారిని అందలం ఎక్కిస్తూ జనసేనను జగన్‌సేనగా మారుస్తున్నారన్నారు. పార్టీ ఫ్లోర్‌లీడర్‌ను మార్చాలని పథకం ప్రకారం కుట్ర చేస్తున్నారని విమర్శించారు.

డిస్పెన్సరీని తనిఖీ చేసిన ఆర్టీసీ చైర్మన్



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు

ద్వారకాబస్‌స్టేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు గురువారం ఎంవీపీ కాలనీలోని ఆర్టీసీ డిస్పెన్సరీని తనిఖీ చేశారు. కార్మికులకు మెడికల్ సదుపాయాలు ఏవిధంగా అందుతున్నాయి, మందుల వివరాలు తెలుసుకున్నారు. ఉత్తరాంధ్ర పరిధిలోని ఉద్యోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు డిస్పెన్సరీని విస్తరించాల్సి ఉందని, ప్రణాళిక తయారుచేసి బోర్డుకు పంపాలని అధికారులు, వైద్యులకు సూచించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచితబస్సు పథకం అమలు చేస్తున్న దృష్ట్యా జిల్లాలో బస్సుల సంఖ్య పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ రీజియన్‌కు త్వరలో 100 కొత్త బస్సులు రానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎస్‌బీ రెడ్డి, విశాఖ ఆర్‌ఎం బి.అప్పలనాయుడు,డీసీటీఎం కె.పద్మావతి, వైద్యు లు టి.వాణినీలిమ, ఎ.ఆశాకిరణ్, డీఈఈ నరసింహారావు, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో డీఆర్‌ఎం పర్యటన



సింహాద్రి థర్మల్ ప్లాంట్‌లో సైడింగ్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం లలిత్‌బోహ్రా

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి):సింహాద్రి సూపర్ థర్మల్ పవర్‌ప్లాంట్‌లో గురువారం డీఆర్‌ఎం లలిత్ బొహ్రా పర్యటించారు. రైల్వే సైడింగ్ కార్యకలాపాలను తనిఖీ చేశారు. రేక్ హ్యాండ్లింగ్, డిశ్చార్జి వ్యవస్థ నిర్వహణను పరిశీలించారు. ఎన్‌టీపీసీ ప్రాంగణంలో రైలు కార్యకలాపాలు, ట్రాక్, విద్యుదీకరణ నిర్వహణ పరిశీలించి సామర్థ్యాన్ని పెంచేందుకు కార్యాచరణ పద్ధతులను సూచించారు. అనంతరం ఎన్‌టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మతో సమావేశమై మౌలిక సదుపాయాలు, నిర్వహణ కార్యకలాపాలు, రేక్ లభ్యతను పెంచడం వంటి పలు అంశాలపై చర్చించారు. ఎన్టీపీసీ సమీపంలోని జగ్గయ్యపాలెం లెవెల్ క్రాసింగ్ గేట్ వద్ద భద్రతా నిర్వహణతోపాటు రికార్డులను తనిఖీ చేశారు. గేట్‌మన్‌తో మాట్లాడి విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.